ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 19.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 358 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

‘మూసీ’పై వాడీవేడి చర్చ

- ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు
- ప్రభుత్వ దోపిడీకి మాత్రమే వ్యతిరేకం: బీఆర్ఎస్
- మంత్రి శ్రీధర్‌బాబు సమాధానాలపై అసంతృప్తి
- సభ నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్
- ప్రతిపక్షం ప్రతి దానికీ అడ్డుపడడం తగదు
- బీఆర్ఎస్ తన వైఖరి మార్చుకోవాలి
- సభలో పూర్తి స్థాయి చర్చకు తాము సిద్ధం: భట్టి
- తప్పుదోవ పట్టించి, బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు
- బీఆర్ఎస్ వైఖరి సరిగ్గా లేదు : మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 18: మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చర్చ ఆసక్తికరంగా జరిగింది. ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, ప్రభుత్వ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. ప్రజల జీవితాలు బాగు పరచాలన్న సంకల్పంతో ఒక యజ్ఞం చేపడుతున్నామని ప్రతిపక్షం ప్రతి దానికీ అడ్డుపడడం తగదని ప్రభుత్వం తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తన వైఖరి మార్చుకోవాలని, సభలో పూర్తి స్థాయి చర్చకు తాము సిద్ధమని ప్రకటించింది. మంత్రి శ్రీధర్‌బాబు సమాధానాలపై బీఆర్ఎస్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల సమయం చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు మూసీ ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమైందని, రూ. 6 వేల కోట్ల నుంచి రూ. 7 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. సుమారు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తుది ఎన్యుమరేషన్ ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు.

మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్

మూసీ ప్రాజెక్టుపై తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా మంత్రులు దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్ పార్టీ అని

...:: మిగతా 2లో



“ప్రతిపక్షం సహకరించకపోయినా రాష్ట్ర అభివృద్ధిని ఆపబోం. అన్ని రంగాల మేధావులతో కలిసి రూపొందించిన విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం. తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతి విషయంపై విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వీరిని ప్రజలు ఓ కంట కనిపెడ్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ, హామీ ఇవ్వని ఎన్నో పథకాలు కొనసాగుతున్నాయి. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు విపక్షాలకు కనిపించడం లేదా?

- సీఎం రేవంత్‌రెడ్డి

తొక్కుకుంటూ వచ్చా.. మళ్లీ బరాబర్ తొక్కుతా

- ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్ఎస్‌తీరు మారలేదు
- ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులు
- కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు
- నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు
- 2034 వరకు అధికారంలోనే ఉంటాం
- ఎన్ని ఆటంకాలు కల్పించినా అభివృద్ధిని ఆపబోం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 18: తాను వారసత్వంగా పదవిలోకి వచ్చిన వ్యక్తిని కాదని, ఒక్కో మెట్టు ఎక్కుతూ.. నన్ను తొక్కాలనుకున్న వారిని తొక్కుకుంటూ వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకు ఉంటుందని ధీమా వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. 2029లో కూడా మళ్లీ బరాబర్ తొక్కుకుంటూ వస్తానని అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై ముఖ్యమంత్రి మాట్లాడారు. గవర్నర్ శివప్రతప్ శుక్ల ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే గొప్ప ప్రణాళికలను ప్రతిపాదించిందని సీఎం తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై ఆయన అసెంబ్లీలో సమాధానమిచ్చారు.

ప్రతిపక్షంలో ఉన్నా వాళ్ల తీరు మారలేదు

అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ వంటి ముఖ్య సందర్భంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ గైర్హాజరు కావడాన్ని సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. “రాజులు పోయినా, రాచరిక పోకడలు మాత్రం పోలేదు” అంటూ ఘాటుగా

...:: మిగతా 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.32 (గురువారం సాయంత్రం)

సహర్ – 4.58 (శుక్రవారం ఉదయం)

రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు

రాజకీయాల్లో రిటైర్మెంట్ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రజా సమస్యలపై పనిచేయడానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

7

‘ఈడీ’ని అడ్డుకోవడం సరికాదు

ఈడీ దాడులు జరుగుతుంటే అడ్డుకుంటారా? ఇది సరైన పద్ధతి కాదంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐప్యాక్ ఆఫీసు, ఆ సంస్థ చీఫ్ ఇంటిపై ఈడీ దాడుల సందర్భంగా మమతా బెనర్జీ అడ్డుకున్న విషయం తెలిసిందే.

7



ఈవీ కారుకు మంటలు.. ఏడుగురు సజీవ దహనం

ఛార్జింగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈవీ కారుకు మంటలు రాజుకున్నాయి. ఆ వాహనం నుంచి బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ఒక ఇంట్లో ఉంచిన గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ నేపథ్యంలో మంటల్లో కాలిపోయి ఏడుగురు సజీవ దహనమయ్యారు.

7

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

- మొక్కజొన్నరైతులకు తీవ్ర నష్టం
- ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే ఇవ్వాలి
- మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ ఆందోళన

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 18: మద్ధతు ధర లేక మొక్కజొన్న రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. మొక్కజొన్నరైతులను ఆదుకోవాలని కోరుతూ గన్‌పార్క్ వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిరసన తెలియజేశారు. మక్కలను మద్ధతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారని, మద్ధతు ధర రూ.2400తో పాటు బోనస్ రూ.500 ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పంటల బీమా వెంటనే అమలు చేయాలని కోరారు. రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అనంతరం మొక్కజొన్న పొత్తులతో నిరసన తెలుపుతూ బస్తాలు తలపై పెట్టుకుని అసెంబ్లీ

...:: మిగతా 2లో

ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

- పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు
- అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలపై సమాలోచన
- అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ నియామకంపై చర్చ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 18 : ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ముఖ్యనేతలతో వరుసగా భేటీ అయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలు, ప్రతిపక్షాల తీరు తదితర అంశాలు చర్చించినట్లు సమాచారం. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌ల నియామకంపై రేవంత్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది. వేణుగోపాల్‌తో భేటీ అయినప్పుడు పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అనేక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు అసెంబ్లీలో చర్చకు వస్తున్న అంశాలు, ప్రతిపక్షాల తీరు తదితర అంశాలు వారి వద్ద చర్చకు

...:: మిగతా 2లో

డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌సరఫరా

- 19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే నెట్‌వర్క్ సిద్ధం
- యాసంగి పంటలు, వేసవికాలం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 18 : యాసంగి పంటల సీజన్‌తో పాటు వేసవి ప్రభావం కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, వినియోగం గణనీయంగా పెరుగుతుందని, 19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌నూ సమర్థంగా తట్టుకునే నెట్ వర్క్ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా

...:: మిగతా 2లో

సీఎస్ పదవీ కాలం

మరో 3 నెలలు పొడగింపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 18: తెలంగాణ సీఎస్ పదవీ కాలం పొడిగించారు. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న రామకృష్ణారావు పదవీ కాలాన్ని పెంచుతూ డీవోపీటీ కీలక నిర్ణయం తీసుకుంది. 3 నెలల పాటు ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

...:: మిగతా 2లో

హర్మూజ్‌వద్ద అమెరికా దాడులు

- ఇరాన్ క్షిపణి స్థావరంపై బాంబులు
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- మా టార్గెట్ కొత్త సుప్రీం లీడర్ : ఇజ్రాయెల్
- త్వరలోనే సురక్షితంగా హర్మూజ్: ట్రంప్
- తీవ్ర ప్రతీకారం తప్పదు: ఇరాన్ వార్నింగ్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో 19వ రోజు కూడా యుద్ధం భీకరంగా సాగుతోంది. ఇరాన్ వ్యాప్తంగా ఇజ్రాయెల్ అమెరికా సంయుక్త దాడులు కొనసాగుతున్నాయి. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టును సడలించేందుకు తీవ్రంగా యత్నిస్తున్న అమెరికా ఆ ప్రాంతంలో భారీ దాడులు చేసింది. శక్తిమంతమైన బీ2బీ బాంబర్లతో 5వేల పౌండ్ల భారీ బంకర్ బ్లస్టర్ బాంబులను ఆ ప్రాంతంలో ప్రయోగించింది. హర్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై ఆ వినాశకరమైన బాంబులను ప్రయోగించినట్లు సెంట్రస్ కమాండ్ తెలిపింది. ఈ స్థావరాల్లోని ఇరాన్ నౌకా విధ్వంసక క్రూయిజ్ క్షిపణులు జలసంధిలో అంతర్జాతీయ నౌకా రవాణాకు ముప్పును

...:: మిగతా 2లో

'మూసీ'పై వాడీవేడి చర్చ

మొదటిపేజీ తరువాయి

ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై కేటీఆర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కొంత సంవాదం జరిగింది. మూసీ అభివృద్ధి కాకూడదని ప్రతిపక్షం కోరుకుంటోందని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. మూసీ ప్రజలు మురికికూపంలో బతకాలనే ప్రతిపక్షం కోరిక సరైనది కాదన్నారు. 18 నెలలో తయారవుతుందన్న మూసీ డీపీఆర్ రెండు నెలల్లోనే ఎలా తయారైందని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ డీపీఆర్ పూర్తయి ఉంటే సభ ముందు ప్రవేశపెట్టాలని కోరారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని పేదల ఇళ్లు కూల్చకుండా అభివృద్ధి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన శ్రీధర్‌బాబు డీపీఆర్ రెండు నెలల్లో పూర్తి కాలేదని తెలిపారు. 2024 డిసెంబర్‌లో మెయిన్‌హార్ట్ అనే సంస్థకు బాధ్యతలు అప్పగించగా, 2026 ఫిబ్రవరిలో ఆ సంస్థ ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

> "మూసీ పరివాహక ప్రజలు అపరిశుభ్రత వాతావరణంలో జీవిస్తున్నారు. మూసీ ప్రజల జీవనగతులు మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. మూసీ అభివృద్ధి కాకూడదని ప్రతిపక్షం కోరుకుంటుందా? నగరానికి మణిహారంగా మూసీని మార్చాలని ప్రయత్నిస్తున్నాం. మూసీ పరివాహక ప్రజలకు పునరావాసం కల్పిస్తామని చెప్పాం. మూసీ ప్రజలు మురికికూపంలో బతకాలనేదే ప్రతిపక్షం కోరిక. ప్రతిపక్షం తీరు సరికాదు"
>
> - భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

వెలుగుమట్ల అంశంపై చర్చకు సిద్ధం

ఫైవ్ స్టార్ హోటల్‌లో కాకుండా మూసీ బాధితుల సమక్షంలో ప్రజెంటేషన్ పెట్టాలని తాము కోరామని, కానీ ప్రభుత్వం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో నిర్వహించడం వల్ల ఆ కార్యక్రమానికి రాలేదని కేటీఆర్ తెలిపారు. పేదలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రేమ వలకబోస్తున్నారని, ఖమ్మం పట్టణంలో వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చారని ఆక్షేపించారు. మూసీ ప్రజలు మురికికూపంలో బతకాలనే ప్రతిపక్షం కోరిక సరైనది కాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆక్షేపించారు. వెలుగుమట్ల అంశంపై చర్చకు సిద్ధమన్న మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్ని విషయాలు వెలుగులోకి వస్తే గులాబీ నేతలు సభలో కూడా ఉండలేరని ఎద్దేవా చేశారు. శాసనసభలో బీఆర్ఎస్ వైఖరి సరిగ్గా లేదన్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు తప్పుదోవ పట్టించి, బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. లక్షన్నర కోట్లు అంటూ వారు ప్రచారం చేసినట్లే అందరూ భావిస్తున్నారని మండిపడ్డారు. మూసీ విషయంలో బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదని, ప్రజలకు మంచి జరిగేందుకు సహకరించే గుణం వారికి లేదని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌లో మార్పు రావాలని సూచించారు.

ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

మొదటిపేజీ తరువాయి

వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వివరించినట్లు సమాచారం. సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు మంత్రులకు దిశానిర్దేశం చేశారని, అందరు కూడా అందుకు కట్టుబడి ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ లను అభినందించినట్లు తెలుస్తోంది.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

మొదటిపేజీ తరువాయి

సమావేశాలకు హాజరయ్యారు. అసెంబ్లీ ప్రాంగణంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిరసన తెలిపారు. అసంబ్లీకి మొక్కజొన్న కంకులు తీసుకెళ్లగా వాటిని మార్షల్స్ లాక్కోవడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి అంటూ ప్లకార్డుల ప్రదర్శనలు చేశారు. ఈ ప్రభుత్వం మొక్కజొన్న రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపిస్తోందని హరీశ్‌రావు అన్నారు. పంట వచ్చి 15 రోజులైనా ఇంకా ఎందుకు కొనుగోలు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. వడగళ్ల వాన పడి పెద్ద ఎత్తున మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బ తిన్నాయన్నారు. ఇప్పటివరకు పంటల బీమా అమలు ఊసే లేదన్నారు.

నిన్ను చంపేస్తాం..

- రాజాసింగ్‌కు ఆగంతకుల బెదిరింపు లేఖ
- అనుచరుల్లో తీవ్ర ఆందోళన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 18 : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపు లేఖ రావడం భాగ్యనగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో కూడా ఆయనకు పలుమార్లు అంతర్జాతీయ నంబర్ల నుంచి, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినప్పటికీ, ఈసారి తేదీ(ఈనెల 27) స్పష్టంగా పేర్కొంటూ లేఖ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతకులు ఆ లేఖలో హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల ఆయన చేసిన ప్రసంగాలతోనే ఈ బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజాసింగ్ చుట్టూ భారీ భద్రత ఉన్నప్పటికీ, ఇలాంటి లేఖలు రావడం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ లేఖ అందిన వెంటనే రాజాసింగ్ కార్యాలయ ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ లేఖ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ నివాసం, ఆయన వెళ్లే ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే అవకాశం ఉంది.

సీఎస్ పదవీ కాలం మరో 3 నెలలు పొడగింపు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే సీఎస్‌గా రామకృష్ణారావు పదవీ కాలం పూర్తి కాగా, ఒకసారి పెంచారు. మరోసారి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. దీంతో ఆయన మరికొన్ని రోజులపాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్ర హోం శాఖ పరిధిలోని పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆమోద ముద్ర వేసింది. 2025 ఏప్రిల్ 30వ తేదీన తెలంగాణ సీఎస్‌గా రామకృష్ణారావుకు బాధ్యతలు అప్పగించారు. అయితే అదే ఏడాది ఆగస్టు నెలలో రామకృష్ణారావు పదవీ కాలం ముగిసింది. దీంతో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. అప్పుడే 7 నెలల పాటు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

డిమాండ్‌కు తగ్గ విద్యుత్ సరఫరా

మొదటిపేజీ తరువాయి

ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. వేసవి కాలం, యాసంగి సాగు సీజన్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 20న నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, ఈ సంవత్సరం మార్చి 2న 17,606 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకుని గత రికార్డును సమం చేసింది. అనంతరం రోజురోజుకీ పెరుగుతున్న డిమాండ్, మార్చి 13న 18,228 మెగావాట్లకు చేరి, 341.08 మిలియన్ యూనిట్ల వినియోగంతో కొత్త రికార్డును సృష్టించిందనీ సమావేశంలో వివరించారు. డిమాండ్ భారీగా పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, ఓవర్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సంస్థలు సమర్థంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ఈ కృషికి విద్యుత్ సిబ్బందిని అభినందించారు. అలాగే, విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. యాసంగి పంటల సీజన్ మరియు వేసవి కాలం ముగిసేంతవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రైతాంగానికి, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, తెలంగాణ డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్ ఫరూఖీ, జితేష్ వి. పాటిల్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొక్కుకుంటూ వచ్చా..

మళ్లీ బరాబర్ తొక్కుతా

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులని, కానీ కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడూ అదే అహంకార ధోరణి ప్రదర్శించారని, ప్రతిపక్షంలో ఉన్నా వాళ్ల తీరు మారలేదని వ్యాఖ్యానించారు. నూతన గవర్నర్‌ను కలవడానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తారనుకున్నామని, రాకపోగా సభ సాంప్రదాయాలను గౌరవించకపోడం తెలంగాణ సంస్కృతికి పూర్తి విరుద్ధం అని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రణాళికలోనైనా రాజకీయం, స్వార్థం, అధికారం కోల్పోయామనే బాధనే విపక్షాల మాటల్లో కనిపిస్తోందని ఆరోపించారు. ఎవరు కలిసి వచ్చినా.. రాకపోయినా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047లో తెలంగాణను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు ఎక్కువగా హైదరాబాద్ వైపు చూస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఒకటి తప్పా మిగతావన్నీ అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల పట్ల బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం గౌరవం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సొంతింటి ఆడబిడ్డను బాధపెట్టిన వారు మహిళ గురించి ఎలా ఆలోచిస్తారని ఆయన ప్రశ్నించారు. సొంత ఆడబిడ్డను లిక్కర్ రాణి అని, సొంత పార్టీ నేతలతో తిట్టించారని ఆరోపించారు.

'హిల్ట్'పై విచారణకు సిద్ధం

తమ ప్రభుత్వం కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు పంపించే హిల్ట్ పాలసీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను సీఎం ఖండించారు. హిల్ట్ పాలసీపై ఏ దర్యాప్తుకైనా సిద్ధమని సభలో ప్రకటించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక 13 లక్షల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి, సన్నబియ్యం కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. రైతును రాజుగా చేసేందుకే రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌పై దృష్టి సారించామని వివరించారు. ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టామని తెలిపారు.

> **రాష్ట్ర అభివృద్ధిని ఆపబోం..**
>
> ప్రతిపక్షం సహకరించకపోయినా రాష్ట్ర అభివృద్ధిని ఆపబోమని సీఎం స్పష్టం చేశారు. అన్ని రంగాల మేధావులతో కలిసి రూపొందించిన విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతి విషయంపై విపక్షాలు ఆరోపిస్తున్నాయని, వీరిని ప్రజలు ఓ కంట కనిపెడ్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ, హామీ ఇవ్వని ఎన్నో పథకాలు కొనసాగుతున్నాయన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు విపక్షాలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి కలసి రావాలని తాము కోరుతున్నా, అభివృద్ధిని అడ్డుపడేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడాన్ని ఆపబోమని సీఎం ప్రకటించారు.

ముందుచూపులో భాగంగానే చెరువుల పునరుద్ధరణ

హైదరాబాద్ అర్బన్ ప్రాంతం క్యూర్‌ను ప్రక్షాళన చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాల్లోని పరిస్థితులు మనకు కనువిప్పు కావాలన్నారు. ముందుచూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవనం చేస్తున్నామని, బతుకమ్మకుంట, నల్లచెరువు, బుమ్‌రుఖ్ ఉద్దౌలా చెరువులను పునరుద్ధరించామని ప్రకటించారు.

మీ కార్యాచరణనే అమలు చేస్తున్నాం

హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ ప్రకటించారని ముఖ్యమంత్రి తెలిపారు. నాలాలపై నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. గతంలో వాళ్లు చెప్పిన మాటలనే ఇవాళ తప్పుపడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ నేతలు సబర్మతి, గంగానది, యమున ప్రాజెక్టులను సమర్థించి మూసీ ప్రాజెక్టును ఎందుకు తప్పుపడుతున్నారని సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ముంపు, కాలుష్యం సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. అందులో భాగంగానే భారీ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు మెట్రో విస్తరణను పట్టించుకోలేదని విమర్శించారు. మెట్రోను విస్తరించేందుకు మేం ఎంతో కష్టపడుతున్నామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటే.. బీఆర్ఎస్ వాళ్లు ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు.

మూసీ–ఉప్పల్

అభివృద్ధిపై కమిటీ..

మూసీ నది పరివాహక ప్రాంతం, ఉప్పల్ భగాయత్ ప్రాంతాల్లో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచాలని సీఎం సవాల్ విసిరారు. "ఎవరెవరు ఎక్కడ ఆక్రమణలు చేసుకున్నారో తెలుసుకోవడానికి నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేద్దాం" అని ప్రకటించారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన సీఎం, గతంలో చెప్పిన మాటలను ప్రజలు మర్చిపోయారని ప్రతిపక్షం భావిస్తోందని విమర్శించారు. నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల బాధ్యతను గుర్తు చేస్తూ సీఎం హెచ్చరించారు. "మన నగరాన్ని మనమే కాపాడుకోకపోతే, చెరువులను పునరుద్ధరించుకోకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు" అని సీఎం అన్నారు.

హర్మూజ్‌వద్ద అమెరికా దాడులు

మొదటిపేజీ తరువాయి

కలిగిస్తున్నట్లు వివరించింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

మరోవైపు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై భారీ దాడులను ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దక్షిణ లెబనాన్‌లోని టైర్ నగర ప్రజలను ముందుగా తరలించిన అనంతరం దాడులు ప్రారంభించామని ఐడీఎఫ్ తెలిపింది. హెజ్‌బొల్లా సంస్థకు చెందిన మౌలిక సదుపాయలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా, లెబనాన్ రాజధాని బీరూట్‌లోని బచౌరా ప్రాంతంలో భారీ పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కనీసం 6 మంది మృతి చెందగా, 24 మంది గాయపడ్డారు అని నివేదికలు వెల్లడించాయి. మంగళవారం రాత్రి ఐడీఎఫ్ బీరూట్‌లో హెజ్‌బొల్లా కమాండ్ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది. అలాగే బెకా ప్రాంతంలో రాకెట్ లాంచ్ స్థావరాలు, ఆయుధ నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది.

మా టార్గెట్ కొత్త సుప్రీం లీడర్ : ఇజ్రాయెల్

మరోవైపు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తమ టార్గెట్ అని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. మొజ్తాబా ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో తెలియకపోయినా, ఆయనను వదిలిపెట్టబోమని ఐడీఎఫ్ ప్రకటించింది. ఏప్రిల్ మొదటి వారంలో వచ్చే పాసోవర్ పండుగ సమయంలో కూడా ఈ సైనిక చర్యలు కొనసాగుతాయని, ఇజ్రాయెల్‌కు ముప్పుగా పరిణమించే ప్రతి ఒక్కరినీ ఏరివేస్తామని పేర్కొంది. ఇరాన్ నుంచి వచ్చిన తాజా వైమానిక దాడులకు గగన రక్షణ వ్యవస్థలు సమర్థంగా ప్రతిస్పందిస్తున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులను ప్రతిస్పందిస్తున్నాయని పేర్కొంది. ఈ శబ్దాలు విజయవంతమైన రక్షణ చర్యల వల్లేనని దుబాయ్ అధికారులు స్పష్టం చేశారు. యూఏఈ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రస్తుతం రక్షణ వ్యవస్థలు క్షిపణి ముప్పును ఎదుర్కొంటున్నాయని, సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని కోరింది.

బహ్రెయిన్, కువైట్‌లో అలర్ట్

బహ్రెయిన్‌లో సైరన్లు మోగించగా, ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. అలాగే కువైట్‌లో కూడా గగన రక్షణ వ్యవస్థలు శత్రు క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుంటున్నట్లు సైన్యం తెలిపింది. ఒకే రోజులో రెండుసార్లు దాడులు జరిగినట్లు కథనాలు వెలువడ్డాయి. మార్చి 17న మాత్రమే యూఏఈ గగన రక్షణ వ్యవస్థలు 10 బాలిస్టిక్ క్షిపణులు, 45 డ్రోన్లను అడ్డుకున్నట్లు తెలిపాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఘర్షణలో యూఏఈ సైన్యం ఇప్పటివరకు 314 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,672 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

సింగపూర్ వద్ద అమెరికా యుద్ధ నౌక కదలికలు

ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాకు చెందిన యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలిని సింగపూర్ సమీపంలోని మలక్కా జలసంధి వైపు కదులుతున్నట్లుగా వార్తలు వెలువడ్డాయి. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం ఈ నౌక సింగపూర్ సమీపంలో కనిపించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. మార్చి 11న జపాన్‌లోని ఒకినావా నుంచి బయలుదేరిన ఈ యుద్ధనౌక దక్షిణ చైనా సముద్రం మీదుగా ప్రయాణిస్తూ సుమారు గంటకు 22 మైళ్ల వేగంతో ముందుకు సాగుతోంది. సాధారణంగా యుద్ధ నౌకలు తమ స్థానాన్ని దాచినా, రద్దీ సముద్ర మార్గాల్లో భద్రత కోసం ట్రాన్స్‌పాండర్‌లను ఆన్ చేస్తారని నిపుణులు చెబుతున్నారు.

> **త్వరలోనే సురక్షితంగా హర్మూజ్ : ట్రంప్**
>
> నాటో మద్దతు లేకపోయినా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి త్వరలోనే సురక్షితంగా మారుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నా దీనికి ఎక్కువ సమయం పట్టదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని, ఒంటరిగానే ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. హర్మూజ్ భద్రతపై అమెరికా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తీర ప్రాంతాలపై అమెరికా దాడులు కొనసాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. పశ్చిమాసియా దేశాలు ముఖ్యంగా ఇజ్రాయెల్ అమెరికాకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. ఈ సహకారం భద్రతా చర్యలకు కీలకమని తెలిపారు.

'తీవ్ర ప్రతీకారం తప్పదు'-: ఇరాన్ వార్నింగ్

సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌ను శాసిస్తూ వస్తున్న ఆ దేశ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారీజానీ మృతిని టెహ్రాన్ ధ్రువీకరించింది. ఆయన మృతి పట్ల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా ఉన్నతాధికారులు ఘన నివాళులు అర్పించారు. ఈ క్రమంలోనే ఆయన మరణానికి తీవ్రమైన ప్రతీకారాన్ని ఎదుర్కొంటారని ఇరాన్ అగ్రనేతలు వార్నింగ్ ఇచ్చారు. అలీ లారీజానీ, ఆయన కుమారుడు, ఇతర భద్రతాసిబ్బంది, బసీజ్ దళం చీఫ్ గులం రెజా సొలేమానీ అమరులయ్యారని ఇరాన్ భద్రతామండలి పేర్కొంది. ఇరాన్ పురోగతి, ఇస్లామిక్ విప్లవం కోసం డాక్టర్ లారీజానీ తన జీవితకాలమంతా పోరాటం చేశారన్న మండలి, దేశ సేవలో తరిస్తూ అత్యంత గౌరవప్రదమైన మరణాన్ని సాధించారని తెలిపింది. ఏ ఒక్కరు మరణించినంత మాత్రాన తమ పోరాటం ఆగిపోదనీ తమ ప్రభుత్వంగా బలంగా నిర్మితమై ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు.

ఆయన స్థానాన్ని భర్తీ చేయడం కష్టం : ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

అటు భద్రతా మండలి కార్యదర్శి అలీ లారీజానీ మృతి పట్ల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్ అంతటా వివిధ హోదాల్లో పనిచేసి, విస్తృతమైన ఫలితాలను అందించిన విలువైన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తి స్థానాన్ని భర్తీ చేయడం కష్టమని అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను విస్తరించడానికి, ఇస్లామిక్ దేశాల మధ్య సానుభూతిని పెంపొందించడానికి, సోదర భావాన్ని బలోపేతం చేయడానికి ఆయన తన శాయశక్తులా కృషి చేశారన్నారు.

అగ్రనేతల హత్యకు ప్రతీకారంగ ఇరాన్ భీకర దాడులు

మరోవైపు ఇరాన్‌లో శక్తిమంతమైన అధికారులు జాతీయ భద్రత మండలి చీఫ్ అలీ లారీజానీ, గులాం రెజా సొలేమానీ హత్యలకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై టెహ్రాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని 100కు పైగా లక్ష్యాలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో టెల్ అవీవ్ సమీపంలోని రమట్ గన్‌లో ఇద్దరు ఇజ్రాయెలీలు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. టెల్ అవీవ్ రైల్వేస్టేషన్‌లో క్లస్టర్ బాంబులు పడి భారీ నష్టం వాటిల్లింది. స్టేషన్ పైకప్పు ధ్వంసమవగా రైళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. టెల్ అవీవ్, జెరూసలేం నగరాల్లో సైరన్లు మోగుతున్నాయి. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్ క్షిపణులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ ధ్వంసమైందని ఐఆర్‌జీసీ ప్రకటనలో పేర్కొంది. అటు ఇరాక్‌లోని అమెరికా ఎంబసీపై వరుసగా రెండో రోజు భారీ డ్రోన్ దాడి జరిగింది. అక్కడ వాటిల్లిన నష్టంపై వివరాలు తెలియాల్సి ఉంది.

> సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం .ఇలాంటి ఉగ్రవాద చర్యలు శత్రువుల ప్రవర్తనను ప్రతిబింబిస్తాయి. ఇస్లామిక్ జాతి సంకల్పాన్ని మరింత బలపరుస్తాయి. కచ్చితంగా న్యాయం జరిగి తీరుతుంది. ప్రతి రక్తపు బొట్టుకూ అమెరికా, ఇజ్రాయెల్ మూల్యం చెల్లించుకోవాల్సిందే.
>
> - ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ

రాజకీయం

చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తోనే బీసీల అభివృద్ధి

- బీసీల ఐక్యతే బీసీల అభివృద్ధికి మూలం
- రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలంతా ఐక్యం కావాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 18: బీసీ సమస్యల పరిష్కారం కోసం రాజకీయ పార్టీలకతీతంగా బీసీ ప్రజా ప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని, ప్రస్తుతం జరిగే బడ్జెట్ సమావేశాలలో చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ సాధించడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. బుధవారం హైదరాబాదులోని హోటల్ అశోకాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ ప్రజాప్రతినిధుల గెట్ టు గెదర్ కార్యక్రమం జరిగింది. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకటి శ్రీహరి, శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, మకన్ సింగ్ ఠాకూర్, మాజీ ఎంపీ వి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు. బీసీ ప్రజా ప్రతినిధుల సమావేశానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరిలు వెల్లడించారు. బీసీ బడ్జెట్ పెంపు బీసీ సబ్ ప్లాన్ సాధన కోసం మంత్రులుగా కాకుండా బీసీ బిడ్డలుగా సాధించడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు అభివృద్ధి చెందాలంటే చట్టబద్ధమైన సబ్ ప్లాన్ ఒక్కటే పరిష్కార మార్గమని ఆయన తెలిపారు, ఎస్సీ ఎస్టీలకు ఏ విధంగానైతే సబ్ ప్లాన్ ఉన్నది బీసీలకు కూడా అలాగే సబ్ ప్లాన్ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తీసుకురావాలని ఆయన కోరారు . పక్కన ఉన్న తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో బీసీ సబ్ ప్లాన్ చట్టం అమలులో ఉన్నదని బడ్జెట్లో కూడా నిధులు అధికంగా కేటాయిస్తున్నారని ఆయన తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో కూడా ఏపీ తరహాలో సబ్ ప్లాన్ చట్టం తీసుకువచ్చి, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కావని అసెంబ్లీలో చట్టం చేశారు రాష్ట్ర బడ్జెట్లో కూడా 42 శాతం నిధుల తో బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్ సాధన కోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కలుస్తామని జాజుల తెలిపారు. ఈ సమావేశంలో, మదత వెంకట్ గౌడ్, కోలా జనార్ధన్, కనకాల శ్యాంకుర్మా, ఈ నిరంజన్, ఏం చంద్రశేఖర్ గౌడ్, పిట్ల శ్రీధర్, కే వీరస్వామి, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, నరసింహ నాయక్, గూడూరు భాస్కర్, ఉదయనేత, శ్రావణి, సత్యం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 18: జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట వారు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం ఎంతగానో అలరించింది. ముఖ్య అతిధిగా హాజరైన కథాశిల్పి ఐతా చంద్రయ్య మాట్లాడుతూ తెలుగు లోగిళ్ళలో ఉగాది పండుగ కొత్త కాంతులు నింపుతుందని, నూతన సంవత్సర శోభలు ఉగాదితో ప్రారంభమౌతుందన్నారు. కవి చీకోటి రాములు రచించిన అక్షర భారతి బాలగేయ సంపుటి పుస్తకావిష్కరణ జరిగింది. అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, కొమురవెల్లి అంజయ్య, డాక్టర్ సుధాకర్, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, గంగాపురం శ్రీనివాస్, కాల్వ రాజయ్య, పెందోట వెంకటేశ్వర్లు, మల్లంల కనకయ్య, శ్రీచరణ్ సాయిదాస్, పిన్నింటి మహేందర్ రెడ్డి, అనిశెట్టి సతీష్ కుమార్, దుడుగు నాగలత, యాడవరం చంద్రకాంత్, తాళ్ళ యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి పాత్రలను వాడండి..

ఆరోగ్యాన్ని కాపాడుకోండి

- 'ఉగాది' మట్టి పాత్రలతో జరుపుకుని కుల వృత్తిని ప్రోత్సహించండి
- తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- కుల వృత్తులను ప్రోత్సహించడానికే కిట్లు అందజేత: మంత్రి పొన్నం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 18 : ప్రకృతిని కాపాడడానికి, కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పురస్కరించుకొని "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి ,కుల వృత్తులను ప్రోత్సహించండి" నినాదంతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఉగాది మట్టి పాత్రల కిట్ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి, కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివని తెలిపారు. మట్టి పాత్రలు వాడకం తరతరాల సంప్రదాయమని, దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని, ఉగాది పండుగ సందర్భంగా 'మట్టి పాత్రలు వాడండి కుల వృత్తులను కాపాడండి .. ఆరోగ్యాన్ని రక్షించుకోండి' అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ ఉగాది పండుగ పురస్కరించుకొని "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి.. కుల వృత్తులను ప్రోత్సహించండి" నినాదంతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ఉగాది మట్టి పాత్రలను అందించినట్లు తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలకు మట్టి పాత్రలు అనువైనవని, మట్టి పాత్రలు వినియోగాన్ని పెంచి కుల వృత్తులను కాపాడడానికి ఈ కిట్లను అందజేయడం జరిగిందన్నారు.

తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, 18: తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభ సందర్భంగా విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ ఆశలు, ఆకాంక్షలకు శ్రీకారం చుడుతుందని, ఈ పండుగ ప్రతి ఇంటికి సంతోషం మరియు శాంతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. 2026 సంవత్సరం ప్రతి బీజేపీ కార్యకర్తకు ప్రత్యేకమైనదని, ఎందుకంటే ఇది భారతీయ జనసంఘ్ స్థాపన జరిగి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఒక గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ మైలురాయి పార్టీ కార్యకర్తలందరికీ ప్రేరణనిచ్చే సందర్భమని, జాతీయత, సేవాభావం, ప్రజల పట్ల అంకితభావంతో కూడిన సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని గుర్తు చేస్తుందని ఎన్. రాంచందర్ రావు అన్నారు.

ఆదివాసీల అభివృద్ధిపై బీజేపీకి శ్రద్ధ లేదు

- ఆదివాసీ ప్రాంతాల సహజ వనరులపైనే బీజేపీకి ఆసక్తి
- ఆదివాసీ హక్కుల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం విఫలం
- అణగారిన వర్గాల ఆత్మగౌరవం కాంగ్రెస్
- ఏఐసీసీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి సీతక్క

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 18 : ఆదివాసీ ప్రాంతాల సహజ వనరులపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఆసక్తి, ఆ ప్రాంతాల ప్రజల అభివృద్ధిపై మాత్రం కనిపించడం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఖనిజ సంపద, అటవీ వనరుల పై ఉన్న శ్రద్ధ అక్కడి ఆదివాసీలపై లేదని మండిపడ్డారు. గ్రామ స్వయం పాలనకు కీలకమైన గ్రామ సభలను, పెసా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభల అనుమతి లేకుండా అనేక ప్రాజెక్టులను అమలు చేయడం ద్వారా ఆదివాసీల హక్కులను హరిస్తోందని ఆమె ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. భారతదేశ ఆత్మగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో కాంగ్రెస్ చారిత్రాత్మకంగా ముందుంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, స్వాభిమానాన్ని కాపాడటం కోసం ఆందోళనకు కాంగ్రెస్ సిద్ధమని స్పష్టం చేశారు. న్యూఢిల్లీ లోని ఇందిరా భవన్‌లో లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విక్రాంత్ భూరియా అధ్వర్యంలో బుధవారం నాడు ఏఐసీసీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఆదివాసీ గిరిజన సమాజాల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, స్వయం పాలన బలోపేతం వంటి అంశాలపై ఆమె తన అభిప్రాయాలను వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనుల అస్థిత్వాన్ని కాపాడుతూ, వారి అభివృద్ధి కోసం తీసుకున్న చర్యలను, ప్రవేశ పెట్టిన చట్టాలను వివరించారు.
మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు దేశ సంపదలో అంతర్భాగమని పేర్కొన్నారు. అందుకే తొలి ప్రధాని నెహ్రూ హయాం నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు పాటు పడ్డాయని గుర్తు చేశారు. కాని బీజేపీ పాలనలో అడవి బిడ్డల భూములు, అటవీ వనరులు, జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితులు రావడం అత్యంత ఆందోళనకరమని ఆమె అన్నారు. అభివృద్ధి అనేది ప్రజల సంక్షేమాన్ని కాపాడుతూ, వారి గౌరవాన్ని నిలబెట్టే విధంగా ఉండాలని తెలిపారు. కాని ప్రస్తుతం మైనింగ్ కార్యకాల పాల కోసం అడవులను పర్యవరణాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆదివాసీ గిరిజన సమస్యలు, అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. ఆయా వర్గాల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన కార్యచరణ రూపొందించారు.

ఎస్సీ, ఎస్టీల బడ్జెట్ కేటాయింపులపై

అసెంబ్లీలో చర్చించాలి

- ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్
- ఇందిరాపార్కు వద్ద జేఏసీ ఆందోళన

ప్రతిపక్షం, సికింద్రాబాద్, మార్చి 18: ఎస్సీ ఎస్టీల సంక్షేమ అభివృద్ధి రక్షణల పై అసెంబ్లీ చర్చించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నాడు ఇందిరాపార్కు వద్ద దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలు మేధావులు వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బడ్జెట్, కేటాయింపులు ఖర్చులపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు 18 శాతం బడ్జెట్, విద్యకు 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీలకు కేటాయిస్తున్న బడ్జెట్ ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. గత రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో ఎస్సీ ఎస్టీలకు ఏ ఒక్క కొత్త పథకాన్ని కూడా అమలు చేసిన పాపానికి పోలేదు. ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి ఓట్లు కొల్లగొట్టింది. కానీ ఎస్సీలకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. మేము అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం ప్రారంభించి 12లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్న హామీ నేటికి కార్యరూపం దాల్చలేదని అన్నారు. పెరుగుతున్న ఎస్సీల జనాభా ప్రకారం 18 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించిందని, కీనీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. ఎస్సీల సంక్షేమానికి బడ్జెట్ లో పెద్దపీట వేస్తున్నామని 2025-26 ఆర్థిక సంవత్సరంలో 40.231.62 వేల కోట్ల రూపాయలను కేటాయించి, కేవలం 19894.91 వేల కోట్లు విడుదల చేశారని, 14732.94 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9 శాఖలు ఒక్క రూపాయి కూడా దళితుల సంక్షేమానికి అభివృద్ధికి ఖర్చు చేయలేదని తెలిపారు. పైగా 3213.59 వేల కోట్లను దారి మళ్ళించారని అన్నారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపు చట్టం కింద 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీల జనాభా 18 శాతం ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయకుండా మిగిలిపోయిన 26వేల కోట్లను చట్ట ప్రకారం క్యారీ ఫార్వర్డ్ చేయాలని కోరారు. ఎస్టిలకు 17,169 కోట్లు కేటాయించినప్పటికీ 3000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్వయ్య, డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరి వినయ్ కుమార్, డీబీఎస్యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అమృత నరసింహ, శివలింగం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఓయూ జేఏసీ వ్యవస్థాపకులు మందాల భాస్కర్ , న్యాయవాదులు, రాహుల్ దివాకర్, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల ఆధారంగా సమగ్ర కుల జనగణన చేపట్టాలి

- మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్
- తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 18: భారత దేశంలోనే మొదటిసారి జరుగుతున్న కుల జనగణనలో అన్ని కులవృత్తులను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని, కులవృత్తి పరంగా సమగ్ర జనగణన చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ కల్చారి అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్, కర్ణాటక మాజీ మంత్రి మాలికయ్య గుత్తేదార్, జేడీఎస్ నాయకులు బాల్ రాజ్ గుత్తేదార్, ఫికా అధ్యక్షులు కుమార్ గౌడ్, అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో కులవృత్తుల సంక్షేమం కోసం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణలో గౌడ్, కర్ణాటకలో ఈడిగ, ఆంధ్ర ప్రదేశ్‌లో శెట్టి బలిజ, ఈడిగ, తమిళనాడులో నాడార్, కేరళలో బిల్లవ, జైశ్వాల్, హల్వాడియ మొదలైన వివిధ పేర్లతో ఉన్న గౌడ్ సమాజాన్ని "కలాల్" పేరుతో ఒకే కులంగా జనగణన చేయాలని సూచించారు. ఇలా చేస్తే ప్రతి వృత్తిలో ఎంత మంది ఉన్నారో, వారి ఆర్థిక స్థితి ఏమిటో స్పష్టంగా తెలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపిందని, కులవృత్తులపై ఆధారపడిన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో అమలైన ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో లేవని, వాటిని దేశ వ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ మోడల్ గా అమలు చేయాలని కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని సమావేశం తీర్మానించింది.

ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

- 600 కోట్ల విలువైన భూమి చుట్టూ ఫెన్సింగ్
- వెంగళరావునగర్‌లో ఆక్రమణల తొలగింపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 18: నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలం వెంగళరావునగర్లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో దీని విలువ రూ. 600ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం ఇచ్చి 45 ఎకరాల భూమని హౌసింగ్ బోర్డు సేకరించింది. మొత్తం 660 ప్లాట్లతో లే ఔట్ వేసింది. ఇందులో పార్కుల కోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావునగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ప్రజావసరాలకోసం 5 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాల వరకూ ఆక్రమణలు జరిగి శాశ్వత కట్టడాలు వచ్చాయి. వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్నవారితో పాటు మరో 3 గ్రూపులు ఈ భూమి తమదిగా చెబుతూ ఆక్రమణలకు పాల్పడిన వారితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసింది. ఎవరి వద్దా సరైన పత్రాలు లేవని నిర్ధారించింది. ఇదే సమయంలో ఆ ఖాళీ స్థలం తమదిగా పేర్కొంటున్న వారు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ విషయంలో హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే కొనసాగుతున్నప్పుడు అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదనే నిబంధనలు పట్టించుకోకుండా, అందులో కొత్తగా షెడ్డులు వేయడం, గుడిసెలు నిర్మించడం, వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ రావడంపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. మీడియాలో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు సంబంధించిన కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా బుధవారం ఆక్రమణలను తొలగించింది. 3 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

“

వీధి దీపాలు కూడా సరిగా పెట్టడం చేత కాని సీఎం రేవంత్ విజన్ 2047 గురించి మాట్లాడుతున్నారు. ప్రజలకు గ్యారంటీల పేరు చెప్పి, మాయ చేసి ఓట్లు దండుకున్న రేవంత్‌ను మించిన మారీచుడు ఇంకెవరైనా ఉంటారా? రైతు ద్రోహి అని, ఓటుకు నోటు దొంగ... అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదు, ప్రభుత్వానికి ముందుంది మొసళ్ల పండగ.

- మాజీ మంత్రి హరీశ్ రావు

ఓపెన్ వాయిస్

కోరలు చాచిన 'కల్తీ' రక్కసి

భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమారు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు.వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ఫ్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు.కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి.అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది.కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాలను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేల డం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించుకోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకందారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు.ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాస్త కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపు తుంది.. ఇంతటి ప్రమాదకర స్థితి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
19.03.2026

రసాయన సంకెళ్ల నుండి విముక్తికి
జీవ వైవిధ్యం.. ఏకైక ప్రత్యామ్నాయం!

రసాయన ఎరువుల నుండి జీవ ఎరువుల వైపు మళ్లడం అనేది రాత్రికి రాత్రే సాధ్యం కాకపోవచ్చు. ఇవి రసాయన ఎరువులకు తక్షణ మరియు పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవచ్చు, కానీ భవిష్యత్తులో స్థిరమైన వ్యవసాయానికి ఇవే ఏకైక మార్గం. రెండు వ్యవస్థలు కొంతకాలం పాటు కలిసి పనిచేయవలసి ఉంటుంది. దిగుమతి భారాన్ని తగ్గించుకోవడానికి, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మరియు రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయాన్ని అందించడానికి ఈ జీవ మార్గాన్ని అనుసరించడం నేటి అవసరం.

వెంక గారి భూమయ్య
9848559863

భారతదేశం నేడు ఆహార భద్రత విషయంలో స్వయంసమృద్ధి సాధించినప్పటికీ, ఆ ఆహారాన్ని పండించేందుకు అవసరమైన ఎరువుల విషయంలో మాత్రం తీవ్రమైన దిగుమతి సవాలును ఎదుర్కొంటోంది. ఇటీవల పశ్చిమాసియాలోని హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు మరియు అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశ ఎరువుల సరఫరా గొలుసు ఎంత బలహీనంగా ఉందో మరోసారి స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో, రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి 'బయోపాత్‌వే' లేదా జీవ మార్గం వైపు మళ్లడం కేవలం పర్యావరణ అవసరం మాత్రమే కాదు, అది దేశ వ్యూహాత్మక భద్రతకు కూడా అత్యంత కీలకం. ఒక దేశం తన ప్రాథమిక అవసరమైన ఆహార ఉత్పత్తి కోసం ఇతర దేశాలపై, ముఖ్యంగా భౌగోళిక రాజకీయంగా అస్థిరంగా ఉండే ప్రాంతాలపై ఆధారపడటం ఎప్పుడూ ప్రమాదకరమే. 2025 నాటి గణాంకాలను పరిశీలిస్తే, హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో అంతరాయం కలిగితే అత్యంత ప్రభావితమయ్యే దేశాలలో భారత్ ఒకటిగా నిలుస్తోంది. చమురు విషయంలో మనకు వ్యూహాత్మక నిల్వలు ఉన్నప్పటికీ, నత్రజని సంబంధిత ఎరువుల విషయంలో అటువంటి రక్షణ కవచం లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం భారతదేశం తన యూరియా అవసరాలలో దాదాపు మూడు వంతుల భాగాన్ని ఒమన్, సౌదీ అరేబియా, ఖతార్ మరియు యూఏఈ వంటి గల్ఫ్ దేశాల నుండే దిగుమతి చేసుకుంటోంది. 202526 నాటికి భారత ఎరువుల సబ్సిడీ బిల్లు అంచనా రూ. 1.86 లక్షల కోట్లుగా ఉంది, ఇది మొత్తం ప్రభుత్వ సబ్సిడీ వ్యయంలో 40 శాతానికి పైగా ఉంటుంది. సరఫరా మార్గాల్లో చిన్న అంతరాయం కలిగినా, అది షిప్పింగ్ ఖర్చులను పెంచి సబ్సిడీ భారాన్ని మరింత పెంచుతుంది. ఇది నేరుగా ఖరీఫ్ సీజన్ సాగుపై మరియు దేశ ఆహార ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేవలం ఆర్థిక పరమైన అంశాలే కాకుండా, దశాబ్దాలుగా రసాయన ఎరువులను విపరీతంగా వాడటం వల్ల భారతదేశ నేలల స్వభావం కూడా పూర్తిగా దెబ్బతిన్నది. శాస్త్రీయంగా ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం (NPK) నిష్పత్తి 4:2:1 కి బదులుగా, ప్రస్తుతం అది ఆందోళనకరంగా 10.9:4.4:1 స్థాయికి చేరుకుంది. రసాయన ఎరువుల అతి వినియోగం వల్ల నేల లోని సూక్ష్మజీవులు నశించి, నేల నిస్సారమవుతోంది. మనం వాడే ఎరువులలో సగం కంటే తక్కువ భాగమే మొక్కలకు అందుతోంది, మిగిలినది గాలిలోకి ఆవిరైపోవడం లేదా భూగర్భ జలాల్లోకి చేరి కలుషితం చేయడం ద్వారా పర్యావరణానికి ముప్పుగా మారుతోంది.

ఈ సంక్లిష్ట సమస్యకు పరిష్కారంగా బయోఫెర్టిలైజర్స్ లేదా జీవ ఎరువులు స్పష్టమైన మార్గాన్ని చూపుతున్నా

యి. ఇవి నేలలో నత్రజనిని స్థిరీకరించే, భాస్వరాన్ని కరిగించే మరియు నేల జీవశాస్త్రాన్ని మెరుగుపరిచే సూక్ష్మజీవుల ద్వారా తయారవుతాయి. ఇవి దేశీయంగా తయారు చేయబడటమే కాకుండా రసాయన ఎరువుల కంటే తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. సిక్కిం రాష్ట్రం వంద శాతం సేంద్రీయ రాష్ట్రంగా మారడం, ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడం వంటి ఉదాహరణలు ఈ మార్పు సాధ్యమేనని నిరూపిస్తున్నాయి. అయితే, ఈ మార్పు క్షేత్రస్థాయిలో విస్తృతంగా విజయవంతం కావాలంటే ప్రభుత్వం తక్షణమే కొన్ని కీలకమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. మొదటగా, ప్రస్తుతం రసాయన ఎరువులకు అందుతున్న భారీ సబ్సిడీల తరహాలోనే జీవ ఎరువులను కూడా ప్రోత్సాహక పథకాల్లో చేర్చాలి. వ్యవసాయ శాఖ ప్రతిపాదించినట్లుగా, సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా, రైతులు ధరతో సంబంధం లేకుండా తమ భూమికి అవసరమైన నాణ్యమైన ఎరువులను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. ఇది మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని పెంచుతుంది.

అలాగే, నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద ఏర్పాటు చేస్తున్న పది వేల బయోఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్లు ఈ విప్లవానికి వెన్నెముకగా నిలవాలి. ఈ కేంద్రాల్లో తయారయ్యే ఎరువులు నాణ్యతతో ఉండేలా చూడటం అత్యంత ముఖ్యం. ప్రస్తుతం ఈ రంగం చిన్న చిన్న ప్రాంతీయ తయారీదారులతో విచ్ఛిన్నమై ఉంది, దీనివల్ల నాణ్యత ప్రమాణాలు సరిగ్గా అమలు కావడం లేదు. ప్రైవేట్ కంపెనీలను కూడా ఈ రంగంలో భాగస్వాములను చేసి, కేవలం ఎరువుల అమ్మకాలకే కాకుండా పంట దిగుబడి ఫలితాలకు కూడా వారిని బాధ్యులను చేయాలి. వీటితో పాటు కొత్త రకమైన సూక్ష్మజీవుల జాతులకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సరళీకృతం చేయాలి. రసాయన ఎరువులతో పోలిస్తే జీవ ఎరువులకు నిల్వ కాలం చాలా తక్కువగా ఉంటుంది, కాబట్టి పరిశోధనల నుండి పొలానికి చేరే వరకు ప్రక్రియ వేగంగా ఉండాలి. బలమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే రైతులు ఈ నూతన పద్ధతులను నమ్మకంగా స్వీకరిస్తారు.

ముగింపుగా చూస్తే, రసాయన ఎరువుల నుండి జీవ ఎరువుల వైపు మళ్లడం అనేది రాత్రికి రాత్రే సాధ్యం కాకపోవచ్చు. ఇవి రసాయన ఎరువులకు తక్షణ మరియు పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవచ్చు, కానీ భవిష్యత్తులో స్థిరమైన వ్యవసాయానికి ఇవే ఏకైక మార్గం. రెండు వ్యవస్థలు కొంతకాలం పాటు కలిసి పనిచేయవలసి ఉంటుంది. దిగుమతి భారాన్ని తగ్గించుకోవడానికి, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మరియు రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయాన్ని అందించడానికి ఈ జీవ మార్గాన్ని అనుసరించడం నేటి అవసరం. హోర్ముజ్ జలసంధి సంక్షోభం మనకు ఒక హెచ్చరికగా భావించి, ఆహార భద్రత మరియు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేయాలి. ఇది కేవలం ఒక విధాన పరమైన మార్పు మాత్రమే కాదు, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన నేలను మరియు స్వయంసమృద్ధి కలిగిన వ్యవసాయ రంగాన్ని అందించే గొప్ప ప్రయత్నం.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

GenZ ...దేశ భవిష్యత్తా లేక సంక్షోభమా?

బి. హర్షవర్ధన్
MSc. (PhD)

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగి ఉన్న దేశం. 65% కంటే ఎక్కువ జనాభా 35 ఏళ్లలోపు ఉంది. ఈ యువ శక్తి దేశాన్ని ప్రపంచంలో ముందుకు తీసుకెళ్లగలదు. కానీ అదే సమయంలో ఒక ప్రమాదకరమైన పరిణామం కూడా కనిపిస్తోంది. GenZ అనే కొత్త తరం (GenZ : 1997-2012 మధ్య జన్మించిన తరం) దిశా రాహిత్యం, మానసిక ఒత్తిడి, వ్యసనాలు మరియు లక్ష్య రహిత జీవనం.టెక్నాలజీ, సోషల్ మీడియా, గ్లోబల్ కల్చర్ అపసవ్య మార్గం లో రాకెట్‌లా దూసుకుపోతున్నది. ఇది అవకాశాల యుగం అయినప్పటికీ, అదే సమయంలో మానసికంగా అత్యంత సున్నితమైన తరం కూడ ఇదే. ఇందులో చాలామంది తమ విలువైన సమయాన్ని కోల్పోతూ, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. ఇది ఒక సామాజిక మరియు జాతీయ సమస్య. ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? దానికి పరిష్కారం ఏమిటి? అనే ప్రశ్నలు ఇప్పుడు సమాజం ముందున్నాయి.

ఒత్తిడి లో సగానికి పైగా...

భారతదేశంలో యువతలో ఆందోళన (anxiety) మరియు డిప్రెషన్ అత్యంత సాధారణ సమస్యలు. కొన్ని అంచనాల ప్రకారం భారతదేశంలో 35-40 కోట్ల మంది యువత ఈ తరానికి చెందుతారు. ఒక పరిశోధన ప్రకారం 18-24 సంవత్సరాల మధ్య యువతలో సుమారు 50% కి పైగా వరకు వారు తమ మానసిక ఆరోగ్యం విషయంలో తీవ్ర ఒత్తిడి లేదా భావోద్వేగ సమస్యలను అనుభవిస్తున్నారని వెల్లడైంది. అంటే ప్రతి ఇద్దరు యువతలో ఒకరు ఏదో ఒక మానసిక సమస్యతో పోరాడుతున్నారన్నమాట.కొన్ని ఆరోగ్య నివేదికల ప్రకారం యువతలో మానసిక ఆరోగ్య కన్సల్టేషన్లలో సుమారు 30-32% కేసులు anxiety సమస్యలకు సంబంధించినవి. అదే సమయంలో పాఠశాల విద్యార్థులపై జరిగిన అధ్యయనాలు చూపించినట్లు సుమారు 25-26% మంది విద్యార్థులు డిప్రెషన్ లక్షణాలను చూపిస్తున్నారు.ఇంకా ఒక ముఖ్యమైన గణాంకం ఏమిటంటే, 13-17 సంవత్సరాల మధ్య వయస్సు గల దాదాపు ఒక కోటి భారతీయ కిశోరులు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది నమోదు అయిన కేసులే. వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

డిజిటల్ వ్యసనం కోల్పోతున్న జీవితం :

ఇప్పటి యువత జీవితాన్ని పూర్తిగా మార్చిన అంశం డిజిటల్ ప్రపంచం. స్మార్ట్ ఫోన్ లేకుండా జీవితం ఊహించలేని పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా, రీల్స్, గేమింగ్, ఆన్‌లైన్ వినోదం —— ఇవన్నీ యువత

రోజువారీ జీవితంలో ప్రధాన భాగంగా మారాయి. కానీ ఈ డిజిటల్ ప్రపంచం ఒక ప్రమాదకరమైన మానసిక బంధనాన్ని కూడా సృష్టిస్తోంది. సోషల్ మీడియా యువతలో తులనాత్మక సంస్కృతిని పెంచుతోంది. ఇతరుల విజయాలు, సంపద, జీవిత శైలి చూస్తూ తమ జీవితం చిన్నదిగా భావించడం ప్రారంభిస్తున్నారు. దీంతో యువతలో మూడు భావనలు పెరుగుతున్నాయి, తక్కువతనం భావనలు, పెరిగి పోతున్న అసంతృప్తి, నిరాశ నిస్పృహలతో రోజుకు అనేక గంటలు మొబైల్ ఫోన్ ముందు గడపడం వల్ల నిద్రలేమి, దృష్టిలోపం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తున్నాయి. చివరకు ఇది మానసిక ఒత్తిడికి దారితీస్తుంది.

లక్ష్య రాహిత్యం & చైతన్యం తగ్గడం :

ఇప్పటి యువత ముందున్న మరో పెద్ద సమస్య జీవిత దిశ తెలియకపోవడం. గత తరాల యువతకు ఒక స్పష్టమైన మార్గం ఉండేది. చదువు పూర్తి చేసి ఉద్యోగం పొందడం ప్రధాన లక్ష్యం. కానీ GenZ ముందున్న అవకాశాలు చాలా విస్తృతంగా ఉన్నాయి. స్టార్టప్‌లు, డిజిటల్ కెరీర్లు, గ్లోబల్ ఉద్యోగాలు .. ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కానీ ఈ అవకాశాల మధ్యే గందరగోళం కూడా పెరిగింది. చాలామంది యువకులు "నా జీవితంలో నేను నిజంగా ఏం చేయాలి?" అనే ప్రశ్నకు సమాధానం కనుగొనలేకపోతున్నారు. లక్ష్యం లేకపోతే జీవితం కూడా స్థిరంగా ఉండదు. ఇంకొక సమస్య రాజకీయ నిర్లక్ష్యం. యువతలో చాలామంది రాజకీయాలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. కానీ దేశ విధానాలు, ఆర్థిక వ్యవస్థ, విద్య, ఆరోగ్యం.. ఇవన్నీ రాజకీయ నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి. యువత రాజకీయంగా చైతన్యంగా లేకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

మానసిక సంక్షోభ పెరుగుదల :

ఇప్పటి యువతలో మానసిక ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి, ఒంటరితనం వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా ఒత్తిడి, విద్యా పోటీ, ఉద్యోగ అస్థిరత .. ఇవన్నీ యువత మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చాలామంది యువత తమ సమస్యలను కుటుంబంతో లేదా స్నేహితులతో చెప్పుకోలేక ఒంటరిగా బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు యువకులు మద్యం, డ్రగ్స్, ఆన్‌లైన్ వ్యసనాలకు బానిసవుతున్నారు. ఇది జీవితాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది. యువతలో ఆత్మవిశ్వాసం తగ్గిపోతే సమాజం మొత్తం బలహీనపడుతుంది.

Zen- z చేయాల్సింది ఏమిటి ?

భారతదేశ యువత ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది. ఒక మార్గం వ్యసనాలు, నిరాశ, దిశా రాహిత్యం వైపు తీసుకెళ్తుంది. మరో మార్గం సృజనాత్మకత, నాయకత్వం, దేశ నిర్మాణం వైపు తీసుకెళ్తుంది. ఈ పరిస్థితి పూర్తిగా నిరాశాజనకమైంది కాదు. సరైన దిశలో మారితే GenZ ప్రపంచాన్ని మార్చగల శక్తి కలిగి ఉంది. మొదటగా డిజిటల్ జీవితంపై నియంత్రణ అవసరం. సోషల్ మీడియాను పరిమితంగా ఉపయోగించడం అవసరం. రెండవది శారీరక ఆరోగ్యం. ప్రతిరోజు వ్యాయామం, క్రీడలు, యోగా వంటి అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. మూడవది పుస్తకాలు చదవడం మరియు ఆలోచనా శక్తిని పెంచుకోవడం. చరిత్ర, సైకాలజీ, సమాజ శాస్త్రం వంటి విషయాలు చదివితే జీవితం మీద అవగాహన పెరుగుతుంది. నాలుగవది సమాజానికి బాధ్యత. రాజకీయ అవగాహన, సామాజిక సేవ, ప్రజాస్వామ్య చైతన్యం యువతలో పెరగాలి. యువత తమ జీవితాన్ని కేవలం వ్యక్తిగత విజయానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ఉపయోగించాలి. ఎంచుకునే మార్గం యువత చేతుల్లోనే ఉంది. మనసును గెలిచిన యువతే ప్రపంచాన్ని గెలుస్తారు. యువత బలంగా ఉంటే దేశ భవిష్యత్తు కూడా బలంగా ఉంటుంది.

(వ్యాసకర్త కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, హైదరాబాద్)

'పరాభవ'కు స్వాగతం

గడప రఘుపతి రావు
996349928

చైత్ర శుద్ధ పాడ్యమినాడు జరుపుకునే తొలి పండుగ ఉగాది.సంవత్సరంలో మొదటిరోజు శుభంగా గడిచినట్లయితే, ఇక ఆ ఏడాది అంతా శుభప్రదమేనని చాలా మంది నమ్మకం.అందుకే ఉగాదిని ఎంతో సంబరంగా జరుపుకోవాలని ప్రయత్నిస్తారు. జీవితంలో ఎదురయ్యే అన్ని అనుభవాలను సమానంగా స్వీకరించాలని తొలిరోజే చెబుతుంది. ప్రతి ఒక పండుగకు ప్రత్యేకతలు ఉన్నట్లే ఈ పండుగకు షడ్రసోపేతమైన ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం ఈ పండుగ ప్రత్యేకతలు. మన సంప్రదాయంలో 60 సంవత్సరాలకు పేర్లు ఉన్నాయి. ఇవే పునరావృతం అవుతూంటాయి. ఇవి "ప్రభవ"తో మొదలై "అక్షయ"తో ముగుస్తాయి. ప్రభవ అంటే కొత్త కాల గమనం ప్రభవించిన సమయం. అక్షయ అంటే 60 సంవత్సరాలు పూర్తి అయినా ముగింపులేని కాల గమనం. ఇలా ఒక్కో సంవత్సరం ఒక్కో విశిష్టమైన పేరుతో మనల్ని పలుకరిస్తుంది. వీటిలో 40 వది పరాభవ.ఈ సంవత్సరం పరాభవ నామ సంవత్సరం. పరాభవ అంటే సంస్కృతంలో ఓటమి, పతనం, పరాజయం, అవమానం అనే అర్థాలు వస్తాయి. ఈ సంవత్సరం ఎంత ఓపికగా, సహనంగా ఉంటే, అంత మంచి జరుగుతుందని తెలుస్తుంది.అయితే ఈ ఏడాదిలో అహంకారం ఉన్నవారికి ఓటమి తప్పదు, వినయంగా ఉంటే మాత్రం ఊహించని అద్భుతమైన మార్పులు చోటు చేసుకుంటాయి.అలాగే అనుకోని విధంగా విజయాలు వరిస్తాయని నమ్మకం. అలాంటి ఈ పరాభవ వత్సరం అందరికీ శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటూ ఆహ్వానిద్దాం. వసంత ఋతువు ఆగమనం ప్రకృతికి కొత్త శోభను తెస్తుంది. చెట్లు చిగురించి పూతకు వస్తాయి. కోయిలలు తమ గానంతో ఆహ్లాదాన్ని పంచుతాయి. సంబరాలతో సంక్రాంతికి పంటను ఇంటికి తెచ్చుకున్న రైతులు సంతోషంగా ఉంటారు అలాంటి సందర్భంలో అడుగిడుతుంది ఉగాది. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు, తెలుగువారిసంవత్సరాది, ఉత్తరాయణంలో వసంత ఋతువు ప్రారంభం ఇలా ఎన్నెన్నో ప్రత్యేకతలతో ఉన్న తెలుగు సంవత్సరాది ఉగాది. ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో శుక్ల పక్షం పాడ్యమి తిథి రోజున ఉగాది పండుగ జరుపుకుంటారు. ఉగాది అంటే యుగానికి ఆరంభం అని అర్థం. యుగం+ఆది= యుగాది. యుగాది కాస్త కాలక్రమంలో ఉగాదిగా మారింది. ఇక ఈ ఏడాది పాడ్యమి తిథి 2026 మార్చి 19 గురువారం ఉదయం 06.53 గంటలకు ప్రారంభమవుతుంది. మరుసటి రోజు అంటే 2026 మార్చి 20వ తేదీ ఉదయం 04.52 గంటలకు ముగుస్తుంది. ఉగాది పండుగ రోజు ఆలయాల్లో పండితుల పంచాంగ శ్రవణం ఉంటుంది. దీని ద్వారా కొత్త తెలుగు సంవత్సరంలో గ్రహస్థితులు, పాడిపంటలు, రాశి ఫలాలు, ఆదాయ వ్యయాలు, కొత్త ఏడాది అనుకూలతలు, ప్రతికూలతలు, వర్షాలు వంటి భవిష్యత్తుకు సంబంధించిన అంచనాలను తెలుసుకుంటారు. హిందూ సంప్రదాయంలో ఏ పండుగ చూసినా ప్రకృతితో ముడిపడి ఉంటుంది.

అందులోనూ ఉగాది పండుగ అయితే ఏ విధంగా చూసినా ప్రకృతి ఆధారంగానే జరుపుకునే పండుగ. వసంత రుతువు ఆగమనాన్ని తెలియజేసే పండుగ ఉగాది పండుగ. ఉగాది పచ్చడి కూడా ఒక ఔషధం. ఉగాది పండుగ రోజు ఏ చెట్టు చూసినా లేత ఆకులతో పచ్చగా కళకళలాడుతూ కనువిందు చేస్తుంటుంది.

షడ్రుచుల సమ్మేళనం ఉగాది

ఉగాది పండుగలో ముఖ్యమైనది షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి. తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వగరు కలయికే ఉగాది పచ్చడి. జీవితంలో మనకు ఎదురయ్యే సుఖ దుఃఖాలను ఒకే రీతిలో స్వీకరించాలనే విషయాన్ని ఈ ఉగాది పచ్చడి బోధపరుస్తుంది. అంతే కాకుండా ఉగాది పచ్చడిలో వేసే బెల్లం ఆనందానికి, పచ్చిమిర్చి కష్టానికి, వేప పువ్వు విషాదానికి, మామిడి మాధుర్యానికి, ఉప్పు భయానికి, చింతపండు ఆరోగ్యానికి ప్రతీకలుగా చెబుతారు. ఇది వేసవి తాపాన్ని తగ్గించడమే కాకుండా వాతావరణ మార్పుల వల్ల వచ్చే రోగాలను సైతం దూరం చేస్తుంది.ఇంతటి ప్రాధాన్యత ఉన్న తెలుగు సంవత్సరాది ఉగాది ని ఆనందంగా జరుపుకుందాం.పరాభవ సంవత్సరాన్ని ఆహ్వానిద్దాం.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లో డ్రైనేజీ అస్తవ్యస్తం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- తీవ్రదుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన

కూకట్‌పల్లి , ప్రతిపక్షం, మార్చి 18 : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కుమూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మ బండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరుబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు,స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ అధికారలు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాపాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 18: ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతవెంకట్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ కమిషన్ వెంకటేశం, 11వ వార్డు కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డిలతో చైర్ పర్సన్ పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో రోడ్లన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజలకు సమయం కేటాయించి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం 11వ వార్డు కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ..డ్రైనేజీలు, రోడ్ల శుభ్రత, నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్త వేరువేరుగా చేసి మున్సిపల్ చెత్త బండిలో వేయాలని సూచించారు. వార్డు అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్,కృష్ణానాయక్,సీనియర్ నాయకులు బాల్వంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, మాజీ వార్డు సభ్యులు రవీందర్ గౌడ్, నాయకులు స్వామి గౌడ్, జగన్ గౌడ్, శివకుమార్ గౌడ్,ఖదీర్, కలీమ్ ఉన్నారు.

పాపయ్యకుంటలోకి మురికి నీళ్లు
కలవకుండా చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 18 : నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న పాపయ్యకుంటలోకి తురక చెరువు నుండి మురికి నీళ్లు కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ఆధ్వర్యంలో బుధవారం నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ వసంతను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ కాలనీలో సుమారు ఎనిమిది ఎకరాల్లో విస్తరించి ఉన్న మంచినీటి చెరువు అయిన పాపయ్యకుంటలోకి 2022 సంవత్సరంలో తురక చెరువు నుండి మురికి నీళ్ల కాలువను కలపడం వల్ల కాలనీ పరిసరాల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా చెరువులో నిల్వ ఉండే మురికి నీళ్ల కారణంగా దోమల సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పాపయ్యకుంట నుండి సిరి బాలాజీ అపార్ట్‌మెంట్స్ వరకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కాల్వ సరిగా లేకపోవడం వల్ల మురికి నీళ్లు, వర్షపు నీళ్లు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని అన్నారు. వెంటనే తురక చెరువు నుండి వచ్చే మురికి నీళ్లను రాజధాని స్కూల్ నుండి రెడ్డి అవెన్యూగేటు వద్ద ఉన్న ఎస్ఎన్‌డీపీ లోకి డైవర్షన్ చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే పాపయ్యకుంట నుండి సిరి బాలాజీ వరకు ఉన్న పైప్‌లైన్‌ను సరిచేయాలని అధికారులను కోరారు. లేదంటే కాలనీ వాసులతో కలిసి పాపయ్యకుంట వద్ద తురక చెరువు నీళ్లు కలిసే కాల్వను మూసివేస్తామని, అలాగే చెరువును మురికి నీళ్లతో కలుషితం చేసిన మున్సిపల్ అధికారులపై హైకోర్టు, హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై డిప్యూటీ ఇంజనీర్ వసంత స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ప్రపోజల్స్ సిద్ధం చేసి అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, మహేష్ గుప్తా, మాధవరావు, అరుణ్ రావు, పాండవ తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీలో అన్ని వసతులు కల్పించాలి: కేఎల్ఆర్

ప్రతిపక్షం ప్రతినిధి, మహేశ్వరం, మార్చ్ 18: గేటెడ్ కమ్యూనిటీల్లో అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత బిల్డర్ దేనని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ డివిజన్ ఫ్యాబ్ సిటీలోని విశాల్ సంజీవిని విల్లాస్ లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. పలు సమస్యలను కేఎల్ఆర్ దృష్టికి తెచ్చారు. క్లబ్ హౌస్ సహా ఇంటి యజమానులకు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం పనులు, వసతులు అన్ని కల్పించాలని బిల్డర్ కు చెప్పారు. కాలనీవాసులతో కలిసి టిఫిన్ చేశారు కిచ్చెన్నగారు. విల్లాస్ లో జరుగుతున్న పనులను పరిశీలించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

పేదలకు 'రంజాన్ తోఫా' పంపిణీ

- ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 18: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, సామాజిక సేవలో ముందుండే 'కైండ్ హార్ట్ ట్రస్ట్' ఆధ్వర్యంలో అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని పేద ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ తోఫా' (రేషన్ కిట్లు) పంపిణీ చేశారు. లింగమయ్య కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు. కైండ్ హార్ట్ ట్రస్ట్ (వాహిద్ ఆధ్వర్యంలో) నిర్వాహకులు సమాజం పట్ల బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని,తోటివారికి సహాయం చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ట్రస్ట్ నిర్వాహకులు మరియు సభ్యులు తనను ఆహ్వానించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యూసుఫ్ కూడా పాల్గొని, పంపిణీ కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించారు. కైండ్ హార్ట్ ట్రస్ట్ తరపున నిర్వాహకులు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద కుటుంబాలకు అవసరమైన బియ్యం, పప్పులు మరియు ఇతర నిత్యావసర వస్తువులతో కూడిన రేషన్ కిట్లను అందజేశారు. ముఖ్యఅతిథి చేతుల మీదుగా రంజాన్ తోఫా అందుకున్న ముస్లిం సోదరీసోదరులు ట్రస్ట్ సభ్యులకు మరియు తుమ్మల పాండురంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కైండ్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం

- ముఖ్య అతిథిగా ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సిస్లా రామకృష్ణ
- ఆత్మీయ అతిథిగా డాక్టర్ వంశీ మాడుగుల

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 18 : ప్రొఫెసర్ ఎం.ఎల్.ష్రాఫ్ 124వ జయంతిని పురస్కరించుకుని, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. 'ఔషధశాస్త్రంలో కృత్రిమ మేధస్సు: ఔషధ విద్య, పరిశోధనలలో ఒక నూతన ఒరవడి' ఇతివృత్తంగా దీనిని నిర్వహించారు. ఐఐసీటీహైదరాబాదు ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ సిస్లా రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, వర్ధమాన ఫార్మసిస్టులు తమ వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, సంప్రదాయ పరిధులకు అతీతంగా ఆలోచించాలని, అంతర్‌విభాగ అభ్యసనాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఫార్మసీలోని విభిన్న రంగాలను అన్వేషించాలని, వినూత్నమైన, సమస్యపరిష్కార దృక్పథాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులు, పరిశోధకులను ఆయన ప్రోత్సహించారు. సాయి లైఫ్ సైన్సెస్ లోని డి.ఎం.పి.కె. విభాగాధిపతి డాక్టర్ వంశీ మాడుగుల గౌరవ అతిథిగా హాజరై, ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఏఐ యొక్క పరివర్తనాత్మక పాత్రను వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. డ్రగ్ మెటబాలిజం, ఫార్మకోకైనెటిక్స్ (డి.ఎం.పి.కె.) యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యత, సాంప్రదాయ ఔషధ అభివృద్ధిలో సవాళ్లు, ఏఐఆధారిత విధానాలు సామర్థ్యాన్ని ఎలా పెంచగలవు, ముందస్తు ప్రమాద అంచనా ఎలా సాధ్యం, అంచనాత్మక, నివారణ వ్యూహాల వైపు దృష్టిని ఎలా మళ్లించగలవు అనే విషయాలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, పరిశ్రమ నిపుణులతో ఒక ప్యానెల్ చర్చను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న పరిశ్రమ నిపుణులు ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ప్రస్తుత పోకడలు, భవిష్యత్తు అవకాశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. తొలుత, ఈ కార్యక్రమ నిర్వాహకుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతించి, ఏఐఆధారిత ఫార్మసీ విద్యలో ఉద్భవిస్తున్న అవకాశాలను చురుకుగా వినియోగించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియాసింగ్ సమన్వయం చేశారు. బి.ఫార్మా, ఎం.ఫార్మా, పీహెచ్.డీ. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

కాకి ఈశ్వర్ కుమారుడి రిసెప్షన్ కు
హాజరైన నాయకులు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి18: బ్రాహ్మణపల్లి గ్రామంలోని పిఎం ఎస్ జె ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్ కుమారుడు కాకి శివరామకృష్ణ-ఉషారాణి వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.

జాతీయ స్థాయికి ఈఏంఆర్ఎస్ గుండాల విద్యార్థులు

ప్రతిపక్షం, గుండాల, మార్చి 18 : గుండాల మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. భారత ప్రభుత్వ సైన్స్ & టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక 'ఇన్‌స్పైర్ మానక్' కార్యక్రమానికి జె. భార్గవి, జి. జగదీష్‌ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించబడుతుందని.అలాగే, అదే పాఠశాలకు చెందిన టి. మానస 'జేఈఈ అడ్వాన్స్‌డ్' మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఎంపిక కావడం మరో విశేషం. ఈ ప్రోగ్రామ్ ద్వారా పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందుతుంది.ఈ విజయాలపై పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ, గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ విజయాలు జిల్లాకు గౌరవం తీసుకురావడంతో పాటు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టు రట్టు

- ఘరానా నిందితుల అరెస్ట్.. 17 బైక్ ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 18 : నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాను పట్టుకుని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా బాసర, ముధోల్, భైంసా, తానూర్, నిజామాబాద్ జిల్లా నవీపేట్, మాక్లూర్, రెంజల్ , వర్ని తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు చోరీలకు గురి అయ్యాయి. వీటిపై ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గత రెండు సంవత్సరాలు గా షేక్ అర్బజ్ అలియాస్ మాయ, షేక్ ఇమ్రాన్ అలియాస్ అబూ అలియాస్ షేక్ సమీర్, షేక్ ఆరిబ్, షేక్ రెహమాన్ అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో గల పలు మండలాలో పల్సర్ బైక్ లు లక్ష్యంగా దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈ నలుగురు కలిసి దొంగతనం చేసిన 17 బైకులను బాసరకు చెందిన ఆవేజ్, ధర్మాబాద్ కు చెందిన షేక్ అర్బాజ్ రెహమత్, సోంకాంబ్లే మనోజ్, షేర్ షాదుల్ షేక్ వ్యక్తులకు విక్రయించారు. ఈ నెలా 17 న సాయంత్రం నవీపేట్ పోలీసులు బాసర రోడ్ అయ్యప్ప టెంపుల్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా నిందితులు పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వెంటపడి పట్టుకున్నారు. వీరిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా, నిందితులు తాము చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు వీరి నుంచి 17 బైక్లను రికవరీ చేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, సమాచారంతో గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి రెండు జిల్లాలకు చెందిన 15 కేసులను చేధించారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు వారిని రిమాండ్‌కు తరలించినట్లు సిపి సాయి చైతన్య వెల్లడించారు. ఇదే కేసులలో షేక్ అర్బజ్ అలియాస్ మాయ, షేక్ ఇమ్రాన్ అలియాస్ అబూ అలియాస్ షేక్ సమీర్ లు గతంలో బైక్, చైన్స్ స్నాచింగ్ దొంగతనాలు చేయగా నిజామాబాద్ నాలుగవ టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. వీరిపై గతంలో 10 కేసులు కలవు. ఈ కేసుల చేధనలో నిజామాబాద్ డివిజన్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సీసీఎస్ ఇన్చార్జి ఏసీపీ మస్తాన్ అలీ, పర్యవేక్షణలో నార్త్ రూరల్ సి.ఐ బి.శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ డి.సాయినాథ్, ఎస్సై మహేష్, నవీపేట్ ఎస్.ఐ కె.శ్రీకాంత్, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ ఠాకుర్ రాజేందర్ సింగ్, సిసిఎస్ కానిస్టేబుల్స్ రవికృష్ణ,సర్దార్ నరేష్ యాదవ్, నరేష్ కుమార్, వసీం, రాజేంద్రప్రసాద్. క్రైమ్ పార్టీ హెచ్‌సి రాజేశ్వర్, రాజారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దత్తు గౌడ్, రాకేశ్, నాగరాజు, శంకర్, బాస్కర్ ఇతర సిబ్బంది సేవలను కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య అభినందించారు.

ఆయిల్ పామ్ పరిశ్రమ సాధనే లక్ష్యంగా కృషి

- అనువైన స్థలం కోసం కలెక్టర్ తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన
- ఫ్యాక్టరీ ఏర్పాటైతే పారిశ్రామికంగా మరింత పురోగతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 18 : వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాను సాగు రంగంలో మరింతగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత రైతాంగానికి లాభాల సిరి అందించాలనే తాపత్రయంతో ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, బోధన్ శాసన సభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి తనదైన శైలిలో కృషి సాగిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక లాభాలను అందిస్తూ, అనేక ప్రయోజనాలు సమకూర్చే ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నిజామాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఆయిల్ పామ్ ఫాక్టరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడడం జరిగిందని, దానిని జిల్లాకు మంజూరు చేసేందుకు సంసిద్ధత తెలిపారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా అనువైన స్థలాన్ని ఖరారు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటైతే పెద్ద సంఖ్యలో ఆదర్శ రైతులు ఈ పంట సాగును చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. దీనివల్ల రైతులకు గణనీయమైన లాభాలు సమకూరడమే కాకుండా, ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం ఉండదని భరోసా కల్పించారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు. స్థల పరిశీలన జరిపిన వారిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులు వరి కాకుండా ఇతర పంటల వైపు మళ్లాలి. వరి పండిస్తే రైతులకు అత్యధిక లాభం రాదు. వరి నుంచి వాణిజ్య, కూరగాయల పంటలవైపు మళ్లాలి. ప్రపంచానికి ఎగుమతి చేసేలా తెలంగాణను తీర్చిదిద్దుతాం. సైంటిస్టులతో భూసార పరీక్షలు చేయించి ఏ పంట వేయాలో చెబుతాం. రైతును రాజును చేస్తాం. రైతు రుణమాఫీ చేశాం. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం.

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

త్యాగం, సేవాభావానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చ్ 18: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే మైనార్టీ సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయతకు, పరస్పర ప్రేమాభిమానాలకు, మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని క్రిస్టల్ గార్డెన్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులోముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా ముస్లిం సోదరులు సామూహిక నమాజ్ నిర్వహించారు. అనంతరం రోజంతా ఉపవాస దీక్షలో ఉన్న మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే రోహిత్ రావు స్వయంగా ఫలహారాలు అందించి ఉపవాసం విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం త్యాగానికి, సేవా భావానికి, దానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్ష మనిషిలో క్రమశిక్షణ, సహనం, పరస్పర సహకారం వంటి విలువలను పెంపొందిస్తుందని అన్నారు.అన్ని మతాలు మానవత్వం, శాంతి, ప్రేమ, సహనం వంటి విలువలను బోధిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి తాసిల్దార్ లక్ష్మణ్ బాబు స్థానిక మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు. యూత్ కాంగ్రెస్ నాయకులు మహేందర్.కౌన్సిలర్లు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రోడ్లకు మోక్షం ఎప్పుడు?

- అసెంబ్లీలో హరీష్ రావు ప్రశ్న
- ఎన్ని ఉత్తరాలు రాసినా రోడ్ల ఊసే లేదు.. స్పందన లేదు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 18: సిద్దిపేట జిల్లాలో రహదారి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు. పది ఉత్తరాలు రాసిన మంత్రి నుంచి స్పందన లేదన్నారు.బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్ & బి శాఖలో కీలకమైన డిప్యూటీ ఈఈ, ఈఈ, ఏఈ పోస్టులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయని, ఈ విషయంపై పలుమార్లు ఉత్తరాలు రాసినా స్పందన లేదని విమర్శించారు.సిద్దిపేట నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అనేక రోడ్ల పనులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్థాంతరంగా ఆగిపోయాయని తెలిపారు. కొత్త రోడ్ల మంజూరుకు చర్యలు లేకపోగా, ఇప్పటికే ప్రారంభమైన పనులు కూడా నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సిద్దిపేట రింగ్ రోడ్డు పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు ఆగిపోవడంతో రోడ్డు గుంతల మయంగా మారిందని, రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
అలాగే,సిద్దిపేట-చిన్నకోడూరు-ఇల్లంతకుంట ఫోర్‌లైన్ రోడ్డు గత ప్రభుత్వ కాలంలో 70 శాతం పూర్తయ్యిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు పూర్తిగా ఆగిపోయాయని విమర్శించారు. రెండేళ్లుగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో ప్రజలు దుమ్ము, ధూళి, ప్రమాదాలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నంగునూర్ మండలంలో సీఆర్ఎఫ్ నిధులతో మంజూరైన ముండ్రాయి-అంక్షాపూర్ రహదారి పనులు కూడా 70 శాతం పూర్తయ్యాక నిలిచిపోయాయని, బిటి ఫైనల్ లేయర్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.సిద్దిపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఖాళీగా ఉన్న ఆర్ & బి అధికారుల పోస్టులను భర్తీ చేయాలని హరీష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- వంగ రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 18: ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట, మామిడి తోటలకు తీరని నష్టం వాటిని రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం నంగునూరు మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సందర్భంగా వంగ రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు మొక్కజొన్న పంట, మామిడి తోటల దెబ్బ తిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టంపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగే వరకు తమ పక్షాన నిలబడాలని రైతులు కోరారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి త్వరితగతిన పరిహారం అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని రైతులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. రైతులకు తగిన పరిహారం చెల్లించే వరకు తాను రైతులకు మద్దతు గా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్పంచ్ బానోతు సరోజిని, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్పీజీ దుర్వినియోగం అధికారుల దాడులు

- 52 సిలిండర్లు స్వాధీనం
- జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 18: గృహ వినియోగానికి సంబంధించిన ఎల్పీజీ సిలిండర్ల దుర్వినియోగం, మళ్లింపు మరియు బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు జిల్లా పరిపాలన ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు.బుధవారం మెదక్ పట్టణంలోని వివిధ హోటళ్లు, టీ పాయింట్లలో వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్న గృహ ఎల్పీజీ సిలిండర్లపై విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లతో కూడిన మూడు ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.ఈ తనిఖీలలో మొత్తం 52 గృహ ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం, 1955లోని సెక్షన్ 6A కింద కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.గృహ ఎల్పీజీ సిలిండర్ల దుర్వినియోగం, మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్‌పై జిల్లా పరిపాలన కఠిన చర్యలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

వివక్షకు మారు పేరు హరీశ్ రావు

- దుబ్బాక నియోజకవర్గ నిధులు సిద్దిపేటకు మళ్లించలేదా..?
- భూనిర్వాసితుల పరిహారంలో వివక్ష చూపలేదా..?
- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 27: సిద్దిపేట నియోజకవర్గానికి నిధులు ఆపివేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివక్ష చూపుతున్నారని విమర్శిస్తున్న హరీష్ రావుకు దుబ్బాక నియోజకవర్గంపై వివక్ష చూపినప్పుడు ఈ వివక్ష గుర్తుకు రాలేదా, అసలు వివక్షకు మారు పేరు ఏమైనా ఉందంటే అది హరీష్ రావే అని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం చెరుకు శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 22 న నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా సిద్దిపేటకు 1,070 కోట్ల నిధులు రద్దు చేశారని లేఖ రాయడం విడ్డూరంగా ఉందని, బిఆర్ ఎస్ హయంలో దుబ్బాక నియోజకవర్గానికి నిధుల మంజూరు లో వివక్ష చూపి దుబ్బాక అభివృద్ధిని అడ్డుకొని వివక్ష చూపలేదా అని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లాలో కట్టిన రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన పరిహారంలో వివక్ష చూపలేదా? సిద్దిపేట, గజ్వేల్ భూమిర్వాసితులకు ఎకరాకు 16 లక్షల చొప్పున ఇచ్చి, మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు మాత్రం 6 లక్షలు ఇచ్చి వివక్ష చూపింది నిజం కాదా అని ప్రశ్నించారు? దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయకాపోవడం, దుబ్బాక నియోజకవర్గ విద్యార్థులకు ఒక డిగ్రీ కళాశాలనైనా మంజూరు చేయాకపోవడం, పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లు, దుబ్బాక పట్టణానికి రింగ్ రోడ్డు కు నిధులు కేటాయించకపోవడం, ఇలా ఏ రకంగా చూసుకున్నా దుబ్బాక నియోజకవర్గ ప్రజల పట్ల చూపిన వివక్ష కు హరీష్ రావు ఏం సమాధానం చెప్తారన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

- ఐదున్నర కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్ 18: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం గిర్మాపూర్ లో స్థానిక సర్పంచ్ చిట్కుల విజయలక్ష్మితో కలిసి మురికి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో 5 కోట్ల 41 లక్షలు మంజూరీ చేసిందని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా నిధులు, ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తుండగా, సర్పంచులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. రాష్ట అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటుండగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రూ 2 లక్షల వరకు పంట రుణమాఫీ, సన్నధాన్యానికి 500 బోనస్ చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోగా, మరో నాలుగు రోజుల్లో రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలలో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి ప్రజా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండగా, జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గజ్వేల్ అభివృద్ధికి సీఎం అడిగినన్ని నిధులు ఇస్తుండగా, విద్య, వైద్యం, రవాణా, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, కాంగ్రెస్ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కీసరి వెంకటేష్, సర్పంచులు చిట్కుల విజయలక్ష్మి, కుమార్ యాదవ్, చెన్నయ్య, యాదగిరి, మాజీ సర్పంచ్ లు విష్ణువర్ధన్ రెడ్డి, చిట్కుల భూంరెడ్డి, గోపాల్ రెడ్డి, నేతలు చిట్కుల గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల కొండల్ రెడ్డి, జయరాంలు గౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు మేళా.. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 18: నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే రైతు మహోత్సవంలో భాగంగా మూడు రోజులపాటు జరిగే రైతు మేళాను ఈ నెల 19వ తేదీన రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఈ నెల 22వ తేదీన సీఎం ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనెల గురువారం రాష్ట్ర మంత్రులు ప్రారంభించే రైతు మేళా కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సంబంధిత అధికారులతో కలిసి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక, రైతు మేళా కోసం సిద్ధం చేస్తున్న 150 స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు మేళాలో భాగంగా వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక, మార్క్ ఫెడ్, ఫిషరీస్, నాబార్డ్, విజయ డైరీ, బ్యాంకర్స్, సహకార సంస్థలు, వివిధ వ్యవసాయ టెక్నాలజీ సంస్థలకు సంబంధించి 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ స్టాళ్లలో ఆయా శాఖల ద్వారా రైతులకు ఉపయోగకరమైన పరికరాలు, నమూనాలు, లైవ్ స్టాకులను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ రైతు మేళా 19వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. రైతు మేళాకు ప్రతిరోజు 3000 నుండి 5000 మంది రైతులు సందర్శిస్తారని చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపా రాణి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, ఆర్ అండ్ బి, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు రవికుమార్, భూపాల్, తిరుపతి నాయక్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కారు ఆటో ఢీకొని ఇద్దరి మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 17 : మెదక్‌నర్సాపూర్ ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులోని హనుమాన్ బండల వద్ద కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో పోతంశెట్టిపల్లికి చెందిన బట్ట కిష్టయ్య, ఎండీ యూసఫ్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను మెదక్ ఏరియా హాస్పిటల్ కు తరలించారు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

- 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రతిపక్షం, చిన్నకోడూరు(సిద్దిపేట), మార్చి 18: స్కూల్ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక ప్రైవేటు స్కూల్ బస్సు 60 పిల్లలతో పాఠశాలకు వెళ్తుంది. ఈ క్రమంలో ఇబ్రహీంనగర్ వద్ద పిల్లలను ఎక్కించుకోవడానికి రోడ్డు పక్కన నిలిపింది. వెనక నుంచి వచ్చిన లారీ బస్సు వెనుక భాగంలో ఢీకొంది. బస్సులో ఉన్న 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108లో విద్యార్థులను సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. పెను ప్రమాదం తప్పిందని పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ ఘనత

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ



ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 18: రాష్ట్రంలో మైనార్టీలను మాజీ సీఎం కెసిఆర్ అనగదొక్కగా, ఆయన కామారెడ్డికి బదులుగా రాజాసింగ్ పై పోటీ చేస్తే బాగుండేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతిన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు ఒరిగిందేమీ లేదని, 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత వైయస్సార్, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. అయితే ఆ రిజర్వేషన్ ఫలాలు మైనార్టీలకు చేరగా, సీఎం రేవంత్ రెడ్డి కృషి ఫలితంగా ప్రస్తుతం పరోక్షంగా 9 శాతం వరకు ప్రయోజనం జరుగుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయగా, పేదరిక నిర్మూలన, సబ్సిడీ ఆదారిత పథకాల వర్తింపు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మైనార్టీ గురుకులాలు, షాదీ ముబారక్, పేద మైనార్టీలకు ఉన్నత చదువులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు తదితర కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్, నాచగిరి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ రవీందర్ గుప్త, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, పంచాయతీ రాజ్ అభియాన్ సంఘటన జిల్లా అధ్యక్షులు కడపల నర్సింహ, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ముందుగా మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతిన్, మాజీ చైర్మన్ సాజిద్ బేగ్ ఆధ్వర్యంలో కబ్రస్తాన్ ఏర్పాటుకు స్థలం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరుకు వినతి పత్రం అందజేయగా, షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోంది. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. రాష్ట్రానికి ఏం తెచ్చారు? రావాల్సిన నిధులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. భారత్‌లో తెలంగాణ అంతర్భాగం కాదా? నిధులు ఎందుకు కేటాయించరు? రాష్ట్ర ఏర్పాటు విషయంలో తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని బీజేపీ కేంద్ర నేతలు అంటే రాష్ట్ర నేతలు ఎందుకు మాట్లాడలేదు.

- అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు

- సభలో ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ మార్చి 18: రాజకీయాల్లో రిటైర్మెంట్ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రజా సమస్యలపై పనిచేయడానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో మోడీ ప్రసంగించారు. పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్పూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోడీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు. హెచ్.డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు. పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు.



ఈడీ దాడులను అడ్డుకోవడం సరికాదు

- మమతా బెనర్జీపై సుప్రీం కోర్టు ఆగ్రహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 18: ఈడీ దాడులు జరుగుతుంటే, అక్కడికి దూసుకెళ్లి, దాడుల్ని అడ్డుకుంటారా? ఇది సరైన పద్ధతి కాదంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐప్యాక్ ఆఫీసు, ఆ సంస్థ చీఫ్ ఇంటిపై ఈడీ దాడుల సందర్భంగా మమతా బెనర్జీ అడ్డుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు స్పందించింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియా ఆధ్వర్యంలోని బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జనవరి 8న పశ్చిమ బెంగాల్, కోల్‌కతాలో ఐ ప్యాక్ సంస్థ ఆఫీసులపై, ఆ సంస్థ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. ఒక మనీ లాండరింగ్ కేసుపై విచారణలో భాగంగా ఈ దాడులు చేసింది. అయితే, ఈ దాడుల సందర్భంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హైడ్రామా నడిపారు. దాడులు జరుగుతున్న ఐ ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లి ఈడీ కార్యకలాపాలకు అడ్డు తగిలారు. అంతేకాదు.. ప్రతీక్ జైన్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, ఇంకొన్ని కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారు. అక్కడ్నుంచి ఐప్యాక్ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ కూడా ఈడీ దాడుల్ని అడ్డుకుని, ఇంకొన్ని డాక్యుమెంట్లు తీసుకుని మమత వెళ్లిపోయారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ సందర్భంగా మమత తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది.



బ్లాక్ ప్లాస్టిక్ వాడుతున్నారా?

దానితో ఇంత ప్రమాదమా?

ఈ ప్రాపంచిక బిజీ జీవితంలో అన్ని ఇన్‌స్టాంట్ అవుతున్నాయి. ప్లాస్టిక్‌తో తయారు చేసే యూజ్ అండ్ త్రో వస్తువులు పెరిగిపోతున్నాయి. జాగ్రత్తగా గమనిస్తే ఈ మధ్యకాలంలో ఫుడ్ ట్రేలు, ఫుడ్ కంటెయినర్లు, స్పూన్లు, ఫోర్కులు, గరిటెలు... ఇలా అన్నీ కూడా 'బ్లాక్ ప్లాస్టిక్'లోనే కనిపిస్తున్నాయి. అయితే 'చూడటానికి అందంగా కనిపిస్తున్నప్పటికీ వీటిలో లేదా వీటితో తినడం ప్రమాదభరితం'..

ఈ ప్లాస్టిక్‌లో బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్లు (BFRs) ఉంటాయి, ఇవి విషపూరితమైనవి.

సీసం, క్యాడ్మియం:

ఈ విషపూరితమైన లోహాలు నాడీ నష్టాన్ని కలిగిస్తాయి. వీటికి బహిర్గతమవడం వల్ల...క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. పునరుత్పత్తి సమస్యలు పెరుగుతాయి. నాడీ సమస్యలు పెరుగుతాయి. హార్మోన్ల అసమతౌల్యం పెరుగుతుంది.

ఈ రంగు ప్లాస్టిక్ వస్తువులన్నీ పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్ల విడిభాగాలు, మిశ్రమ ప్లాస్టిక్స్‌తో తయారవుతాయి. ఈ ప్లాస్టిక్ డబ్బాలు, వాటిలోని ఆహార పదార్థాల్లోకి ప్రమాదకరమైన రసాయనాలను విడుదల చేస్తాయి.వీటిలో క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యతకు కారణమయ్యే విషపూరిత జ్వాల నిరోధకాలు (Toxic flame retardants) ఉంటాయి. ఈ ప్లాస్టిక్‌లు వేడి ఆహారాన్ని ప్యాక్ చేయడానికి, ముఖ్యంగా మైక్రోవేవ్‌లో వేడి చేయడానికి అస్సలు సురక్షితం కావు. ఇవి మరింత వేగంగా రసాయనాలు ఆహారంలో కలుస్తాయి. సదరు ఆహారం హార్మోన్స్ మీద ప్రభావం చూపు తుంది. క్యాన్సర్ కారకాలుగా మారుతాయి.. బ్లాక్‌ప్లాసిక్ వల్ల ఉత్పన్నమయ్యే రసాయనాల కారణంగా స్థూల కాయం వస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. పిల్లల ఐక్యూ లెవల్ తగ్గుతుంది. న్యూరలాజికల్ డిజాస్టర్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి..

దీనిలో ఉండే 'డెకా బీడీఈ' వంటి రసాయనాలు 85 శాతం ప్లాస్టిక్‌లో ఇమిడిపోవు. ఫలితంగా అవి వేడి, ఆహారంలోని ఇతరత్రా రసాయనాలు, కొవ్వుతో కలిసి జీర్ణ వ్యవస్థను దెబ్బ తీస్తాయి.

ఇలాంటి బాక్సుల్లో నిల్వ చేసే ఆహార పదార్థాల్లోకి ఆ కెమికల్స్ కలిసిపోతుంటాయి. ముఖ్యంగా వేడి, నూనెతో కూడిన లేదా ఆమ్లాహారాన్ని (ఆసిడిక్ ఫుడ్)ను నిల్వ చేసిన సమయంలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

బ్లాక్ ప్లాస్టిక్ ఉత్పత్తి కోసం కర్బన్ బ్లాక్‌ను ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా 1.3 మిలియన్ మెట్రిక్ టన్నులు తయారు చేస్తున్నారు. మామూలు ప్లాస్టిక్‌తో పోలిస్తే బ్లాక్ ప్లాస్టిక్ ఎక్కువ ప్రమాదకారి అని ఇటీవల పరిశోధనల్లో తేలింది. దీనివల్ల పర్యావరణ సమస్యలు కూడా అధికం. వీటి వినియోగంతో ముడిపడి ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన లేదు. వీలైనంతవరకు బ్లాక్ ప్లాస్టిక్ కంటైనర్లలో ఉన్న ఆహారాన్ని తినక పోవడమే మంచిది. ఇది పర్యావరణాన్ని కాపాడినట్టు అవుతుంది. అలాగే మీ ఆరోగ్యాన్ని రక్షించుకున్నవారవుతారు...

నిజానికి ప్లాస్టిక్ ఉత్పత్తులు ఏవీ ఆరోగ్యానికి, పర్యావరణానికి మంచివి కావు.ఈ రసాయనాలు క్యాన్సర్ కారకాలను కలిగిస్తాయి. వంటగదిలో చెక్క పాత్రలను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ పాత్రల వాడకాన్ని నివారించవచ్చు. వంటగదిలో నాన్ స్టిక్ పాన్ లేదా కడాయి ఉపయోగిస్తుంటే జాగ్రత్తగా ఉండండి. దాని నుంచి వెలువడే రసాయనాలు మిమ్మల్ని అనారోగ్యానికి గురిచేస్తాయి. బ్లాక్ నాన్ స్టిక్ పాత్రలకు బదులు స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలను ఎంచుకోవాలి. ఆహారాన్ని వేడి చేయడానికి, వడ్డించడానికి, తినడానికి గాజు, సిరామిక్ పాత్రలను ఉపయోగించడి.

నలుపు రంగు ప్లాస్టిక్ వంటగది పరికరాలకు బదులుగా, మెటల్, కలప లేదా వేరే రంగు ప్లాస్టిక్ లేదా సిలికాన్ పరికరాలను వాడండి. అరటి ఆకులు, బాంబూ ప్లేట్లు వంటి వాటిని ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ముఖ్య గమనిక

ప్రస్తుతం మారిన జీవన విధానం, తీసుకుంటున్న ఆహారంలో మార్పుల కారణంగా వ్యాధుల బారిన పడు తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్యల నుంచి తప్పించుకోవాలంటే బయట ఆహారం తీసుకోవడాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణహిత ప్యాకేజింగ్ వస్తువులను ఉపయోగించాలి. ముఖ్యంగా పిల్లలను ప్లాస్టిక్‌కు దూరంగా ఉంచాలి. మైక్రోప్లాస్టిక్‌ల వల్ల మానసిక వికాసంలో ఆటంకం కలిగే అవకాశం లభిస్తోంది.

"నువ్వు తినే ఆహారమే నీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది".

"The first duty of life is to be as healthy as possible."

డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్
7702417779

అందరికి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు..

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల (తీపి, పులుపు, కారం, చేదు, ఉప్పు, వగరు) ద్వారా జీవితంలోని కష్టసుఖాలను స్వీకరించినట్లే, ఈ సంవత్సరం పోషకాహారం, సీజనల్ ఫుడ్ తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుందాం. ముఖ్యంగా మనం రోజు తీసుకొనే ఆహార పదార్థాలను ప్లాస్టిక్ తో తయారు చేసిన యూజ్ అండ్ త్రో వస్తువులలో వాడటం తగ్గించి రోజు నీళ్ళతో కడిగి శుభ్రం చేసిన స్టీల్ పాత్రలను వాడుదాము.. ఇలాంటి కొన్ని పద్ధతులు మనం పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చు.

ఈ ఉగాది నుంచి 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నట్లుగా మన ఆహారపు అలవాట్లలో మంచి మార్పులు చేసుకుందాం!

ఈవీ కారుకు మంటలు

- ఏడుగురు సజీవ దహనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, భోపాల్, మార్చి 18: ఛార్జింగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈవీ కారుకు మంటలు రాజుకున్నాయి. ఆ వాహనం నుంచి బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ఒక ఇంట్లో ఉంచిన గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ నేపథ్యంలో మంటల్లో కాలిపోయి ఏడుగురు సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురికి తీవ్ర కాలిన గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇండోర్‌లోని బెంగాలీ స్క్వేర్ సమీపంలోని ఒక బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. పుగాలియా కుటుంబానికి చెందిన బిల్డింగ్ సెల్లార్‌లో ఉన్న ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ) ఛార్జింగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆ కారులో మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే మూడు అంతస్తుల నివాస భవనమంతా మంటలు వ్యాపించాయి. కాగా, ఆ బిల్డింగ్‌లోని ఒక ఇంట్లో 12కు పైగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచారు. మంటలు వాటికి వ్యాపించాయి. సుమారు నాలుగు గ్యాస్ సిలిండర్లు వరుసగా పేలాయి. గ్యాస్ సిలిండర్ల పేలుడు ధాటికి ఆ ప్రాంతం స్వల్పంగా కంపించింది.పేలుళ్ల తీవ్రత వల్ల భవనంలో కొంత భాగం కూలిపోయింది. గ్యాస్ సిలిండర్ల పేలుళ్ల శబ్దానికి స్థానికులు భయాందోళన చెందారు. మరోవైపు మంటలు చెలరేగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ డోర్ లాక్ అయ్యింది. ఈ నేపథ్యంలో సహాయక చర్యలు క్లిష్టమయ్యాయి. ఆ ఇంట్లో నివసించేవారు లోపల చిక్కుకుపోయారు. మంటల్లో కాలి ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ముగ్గురిని స్థానికులు కాపాడారు. కాలిన గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదం గురించి తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ ఇంటికి వచ్చిన బంధువులు రాత్రివేళ అక్కడ బస చేసిన సమయంలో ఈ విషాదం జరిగింది. ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమైనట్లు ఇండోర్ కలెక్టర్, ఎస్పీ తెలిపారు. సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ తో ప్రేమ... మోడీతో పెళ్లి

- సభలో ఖర్గే చమత్కారం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 18: ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే ఇవాళ రాజ్యసభలో నవ్వులు పూయించారు. రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్న నేపథ్యంలో.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సభలో జరిగిన అంశాలను ప్రస్తావించారు. తన రాజకీయ జర్నీ గురించి కొంత వివరించారు. ప్రస్తుత కాలపరిమితి ముగియడంతో.. మాజీ ప్రధాని దేవగౌడ, ఎన్సీపీ నేత శరద్ పవార్ కూడా వీడ్కోలు తీసుకుంటున్నారు. అయితే ఖర్గే తన ప్రసంగంలో దేవగౌడతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. దేవగౌడ గతంలో దేశ ప్రధానిగా చేశారని, ఎన్నో కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించారని, ఆయన గత 54 ఏళ్లుగా తనకు పరిచయం ఉందని, ఆయనతో కలిసి పనిచేసినట్లు ఖర్గే తెలిపారు. అయితే ఏం జరిగిందో ఏం తెలియదు కానీ, తమతో డేటింగ్ చేసి, తమను ప్రేమించిన అతను.. ప్రధాని మోదీని పెళ్లి చేసుకున్నారని అన్నారు. దీంతో సభలోని సభ్యులందరూ నవ్వేశారు. అక్కడే ఉన్న ప్రధాని మోదీ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు.

ప్రతిపక్షం
Prathipaksham.in
8
హైదరాబాద్
గురువారం
19.03.2026
సినిమా

సన్ రైజర్స్ కెప్టెన్‌గా
ఇషాన్ కిషన్!

ఐపీఎల్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కీలక ప్రకటన చేసింది. గాయం కారణంగా తమ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లీగ్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో జట్టుకు కొత్త కెప్టెన్‌ను అనౌన్స్ చేసింది. యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తమ కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఇక మరో బ్యాటర్ అభిషేక్ శర్మను వైస్‌కెప్టెన్‌గా ప్రమోట్ చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఈ ఇద్దరూ జట్టును నడిపించనున్నారు. అయితే కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకొని వచ్చిన తర్వాత మళ్లీ అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ మేరకు స్పష్టతనిస్తూ సన్‌రైజర్స్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసిది. కాగా, ఈ కొత్త ఎడిషన్ సన్‌రైజర్స్ మ్యాచ్‌తోనే ప్రారంభం కానుంది. మార్చి 28న సన్ రైజర్స్ ఆర్సీబీ బెంగళూరు చిన్నస్వామి వేదికగా తలపడనున్నాయి. అయితే కొన్ని నెలలుగా కమిన్స్ వెన్ను నొప్పితో ఆటకు దూరమయ్యాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే వైదొలిగాడు. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సైతం కమిన్స్ దూరంగా ఉన్నాడు. అయితే ఐపీఎల్ ప్రారంభం నాటికి కోలుకుంటాడని ముందుగా భావించారు. కానీ, కమిన్స్ ఫుల్ ఫిట్‌గా వచ్చేందుక ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సన్‌రైజర్స్ ఈ ప్రకటన చేసింది.

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్
టాప్-5లో ముగ్గురు భారత క్రికెటర్లు

ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ప్లేయర్లు టాప్ 5లో ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన ఫామ్‌ను చాటుకున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. ప్రపంచంలోని టాప్5 బ్యాటర్లలో ముగ్గురు భారతీయులే ఉండటం టీమిండియా బ్యాటింగ్ పటిష్టతకు నిదర్శనం. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఆశ్చర్యకరంగా నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్ట్జ్ నాలుగో స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా ఆఫ్ఘనిస్తాన్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానంలో ఉండగా,..సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) టాప్ 3లో నిలిచారు.

మహిళల ర్యాంకింగ్స్
స్మృతి మంధాన టాప్!

మహిళల వన్డే క్రికెట్‌లోనూ భారత్ తన జెండాను ఎగురవేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతూ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కివర్‌బ్రంట్ రెండో స్థానంలో ఉండగా.. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచి టాప్5లో చోటు సంపాదించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ కూడా మెరుగైన ర్యాంకులు సాధించారు.

చెస్ టోర్నీకి హంపి దూరం

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు క్రీడా ప్రపంచంపై ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ దేశాల మధ్య మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా భారత చెస్ స్టార్ కోనేరు హంపి ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. సైప్రస్‌లోని పెజియాలో మార్చి 28 నుంచి ప్రారంభం కావాల్సిన ప్రతిష్టాత్మక 'వుమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్' నుంచి ఆమె తప్పుకుంటున్నట్లు కటించారు.ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. అమెరికాఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ జరిపిన డ్రోన్ దాడులు సైప్రస్ వంటి దేశాలను కూడా వణికిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల దృష్ట్యా తన భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ హంపి ఈ టోర్నీకి వెళ్లకూడదని నిశ్చయించుకున్నారు. ద్వీప దేశమైన సైప్రస్, లెబనాన్ నుంచి కేవలం 150 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ నుంచే ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా గ్రూపులు తమ కార్యకలాపాలను సాగిస్తున్నాయి. ఇటీవలే సైప్రస్ లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం అక్కడ భద్రతాపరమైన సవాళ్లను పెంచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆట కంటే ప్రాణ రక్షణే ముఖ్యమని భావించిన హంపి.. ఈ కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు.

ఇలాంటి సినిమా చూసి చాలా కాలమైందని
'ఉస్తాద్ భగత్ సింగ్' చూసిన ప్రతి ఒక్కరూ అనుకుంటారు

ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా కాగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చిత్ర బృందం, ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించింది. ఈ సందర్భంగా కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "ముందుగా మీడియా మిత్రులకు కృతజ్ఞతలు. చాలా రోజుల తరువాత మిమ్మల్ని ఇలా కలవడం సంతోషంగా ఉంది. ఈ ఉగాది 'ఉస్తాద్ ఉగాది' కాబోతుంది. ఒక బిగ్ స్టార్ నుంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ వచ్చి చాలా కాలమైందని నా అభిప్రాయం. అభిమానులు మాత్రమే కాకుండా, సాధారణ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేసేలా స్టార్ హీరో నుంచి అన్ని హంగులతో వచ్చిన సినిమా ఈ మధ్య కాలంలో లేదని నా ఫీలింగ్. పాటలు, డ్యాన్స్, డైలాగులు, ప్రేమ, హాస్యం, విలన్ తో పవర్ ఫుల్ సీన్స్.. ఇలా అన్ని అంశాలు ఉంటాయి. ఉస్తాద్ భగత్ సింగ్ ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందని నేను చెప్పలేని కానీ, ఒక విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఇలాంటి సినిమా వచ్చి కాలమైంది, ఇంత ఎంటర్‌టైనింగ్ సినిమా వచ్చి చాలా కాలమైందని అనుకుంటారు. హెయిర్ స్టైల్ నుంచి డ్యాన్స్, డైలాగ్ లు, హాస్యం వరకు ఇలా పవన్ కళ్యాణ్ గారి నుంచి కోరుకునే అన్ని అంశాలు ఇందులో ఉండి.. పూర్తిస్థాయి పవన్ కళ్యాణ్ గారి సినిమా చూశామనే సంతృప్తిని ఇస్తుంది ఉస్తాద్. అనుకున్న సమయంలో సినిమాను పూర్తి చేసి, మంచి అవుట్ పుట్ ఇచ్చాము. పక్కా ప్లానింగ్ తో సమయాన్ని, డబ్బుని వృధా చేయకుండా ఈ సినిమా పూర్తి చేయగలిగాము. అలా చేయగలగడానికి మా ప్రధాన బలం పవన్ కళ్యాణ్ గారు. ప్రజా పాలన, పరిపాలనా పరమైన అంశాలకు ఇబ్బంది కలగకుండా మాకు సమయం ఇచ్చే వాళ్ళు. ఫలానా సమయానికి రాగలనని, ఇంత సమయం కేటాయించగలనని ముందుగానే సమాచారం ఇచ్చేవారు. మైత్రి మూవీ మేకర్స్ లాంటి నిర్మాతలను కాపాడుకోవడం నాలాంటి ప్రతి దర్శకుడి బాధ్యత. వీళ్ళు మరిన్ని సినిమాలు తీస్తూ, పది కాలాల పాటు ఇండస్ట్రీలో ఉండాలి. సినిమా ఆలస్యమైనా ఒక్కసారి కూడా అసహనం ప్రదర్శించలేదు. బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. నేను అడిగిన దానికంటే ఎక్కువే ఇచ్చారు. మా నిర్మాతల మద్దతు వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. అలాగే చివరి నిమిషంలో హీరోలా వచ్చి, నేపథ్య సంగీతం బాధ్యత తీసుకున్న తమన్ కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇలాంటి అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమాకి కేవలం 1213 రోజుల్లో అద్భుతమైన నేపథ్య సంగీతం అందించాడు. ఈ సినిమాకి అన్నీ కుదిరాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఇలాంటి పూర్తిస్థాయి ఎంటర్‌టైనింగ్ సినిమా చూసి కాలమైందని చూసిన ప్రతి ఒక్కరూ కనీసం పది మందికి చెబుతారు. అభిమానులు మళ్ళీ మళ్ళీ చూస్తారు." అన్నారు.

దురంధర్ 2 తెలుగు ప్రీమియర్లు క్యాన్సిల్

బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధురంధర్: ది రివెంజ్' తెలుగు ప్రీమియర్ల కోసం ఎదురు చూస్తున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. కంటెంట్ డెలివరీలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నేడు (మార్చి 18) ప్లాన్ చేసిన అన్ని తెలుగు వెర్షన్ పెయిడ్ ప్రీమియర్ షోలను అధికారికంగా రద్దు చేశారు. ఇప్పటికే బుక్‌మైషో, పేటీఎం వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ షోల బుకింగ్స్‌ను తొలగించడమే కాకుండా, టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు పూర్తి మొత్తాన్ని వెనక్కి ఇచ్చే రీఫండ్ ప్రక్రియను కూడా నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సాంకేతిక ఇబ్బందుల ప్రభావం కేవలం తెలుగు మరియు ఇతర ప్రాంతీయ భాషా ప్రీమియర్లపైనే పడగా, హిందీ వెర్షన్ కంటెంట్ అందుబాటులో ఉండటంతో నగరంలోని కొన్ని ప్రధాన మల్టీప్లెక్స్‌లలో హిందీ షోలు యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది. సుమారు 3 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివితో, 'A' సర్టిఫికేట్ పొందిన ఈ భారీ చిత్రం రేపు ఉదయం నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ప్లాన్ చేసిన విధంగానే గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీమియర్ షోల రద్దుతో నిరాశ చెందిన ప్రేక్షకులు తమ రీఫండ్ స్టేటస్ గురించి సంబంధిత యాప్స్ లేదా థియేటర్ యాజమాన్యాన్ని సంప్రదించాలని చిత్ర బృందం సూచించింది.

కథనార్.. అప్‌డేట్ రెడీ

మన టాలీవుడ్ క్వీన్ అనుష్క శెట్టి నుంచి గత ఏడాది ఘాటీ సినిమా వచ్చి ఆడియెన్స్ ని పలకరించింది. అయితే ఈ సినిమా అనుకున్న రేంజ్ సక్సెస్ సాధించలేదు. ఇక తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసమే అంతా ఎదురు చూస్తుండగా ఈసారి అనుష్క ఒక సాలిడ్ హారర్ థ్రిల్లర్ తో ఆడియెన్స్ ని పలకరించేందుకు సిద్ధం అయ్యింది. మరి ఆ చిత్రమే 'కథానార్'. దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి అవైటెడ్ టీజర్ గ్లింప్స్ పై ఇప్పుడు ఓ ఆసక్తికర పోస్టర్ తో అనుష్క అప్డేట్ ఇవ్వడం జరిగింది. ఈ సినిమా నుంచి ఈ మార్చి 31న మధ్యాహ్నం 1 గంట 31 నిమిషాలకి ఆ అప్డేట్ రివీల్ చేస్తున్నట్టు రివీల్ చేశారు. మరి ఈ పోస్టర్ చూస్తుంటే హారర్ ఎలిమెంట్స్ ని గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. సో ఇదెలా ఉంటుందో తెలియాలి అంటే ఈ నెలాఖరు వరకు ఆగాల్సిందే. ఇక ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవా తదితరులు నటిస్తుండగా శ్రీ గోకులం మూవీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

'ఎల్లమ్మ' హీరోయిన్ మార్పు

'బలగం' సినిమాతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న వేణు యెల్దండి, తన నెక్స్ట్ చిత్రాన్ని 'ఎల్లమ్మ' పేరుతో తెరకెక్కిస్తున్నాడు. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ ప్రాజెక్ట్‌లో నాని లేదా నితిన్ వంటి అగ్ర హీరోలు నటిస్తారని ప్రచారం జరిగింది. ఆ సమయంలో మహానటి కీర్తి సురేష్ కూడా ఈ సినిమాలో నటించడానికి ఎంతో ఆసక్తి చూపించారు. కానీ, హీరో ఎంపికలో మార్పులు జరగడం, చివరకు ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా ఈ ప్రాజెక్ట్ లోకి రావడంతో సమీకరణాలు మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం, దేవి శ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తుండటంతో కీర్తి సురేష్ ఈ చిత్రం నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. డీఎస్పీ లీడ్ రోల్ ప్లే చేస్తున్న పక్షంలో తాను ఈ బోర్డులోకి రావడానికి సిద్ధంగా లేనని ఆమె నిర్మాతలకు సున్నితంగా తెలియజేసినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్ నుంచి కీర్తి తప్పుకోవడం ఇప్పుడు ఫిల్మ్ నగర్ లో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు, దేవి శ్రీ ప్రసాద్ తన మొదటి సినిమా కోసం హీరోగా తనను తాను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ప్రస్తుతం 'ఎల్లమ్మ' బృందం హీరోయిన్ వేటలో పడింది. ఈ పాత్ర చాలా కీలకం కావడంతో సాయి పల్లవి వంటి నటనకు ప్రాధాన్యమున్న నటీమణులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఏ టాప్ హీరోయిన్ కూడా ఈ సినిమాపై సంతకం చేయలేదు. దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ 'డ్రీమ్ ప్రాజెక్ట్' త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. బలగం వేణు మార్క్ మేకింగ్‌తో రాబోతున్న ఈ సినిమా చివరకు ఎవరిని హీరోయిన్‌గా ఎంచుకుంటుందో వేచి చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200